teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 82 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 14 జూలై 2024 | పేజీలు : 08 | వెల ' 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఎస్పీఎఫ్ చేతుల్లోకి వెళ్లనున్న తెలంగాణ సెక్రటేరియట్ భద్రత..?

హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): త్వరలోనే తెలంగాణ సెక్రటేరియట్ భద్రత ఎస్పీఎఫ్ చేతుల్లోకి వెళ్లనుంది. ఇప్పటికే ఈ ఫైల్ సిఎం రేవంత్ రెడ్డి దగ్గరకు చేరినట్టుగా సమాచారం. కొత్త సెక్రటేరియట్ ప్రారంభం నుంచి తెలంగాణ

మిగతా 2 లో






### ఎలాంటి పెండింగులు లేకుండా ఫీజు
## రీయింబర్స్‌మెంట్స్ వేస్తాం
### రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త వినిపించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎలాంటి పెండింగులు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజినీరింగ్ కళాశాలలకు సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దేశంలో తొలిసారిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బకాయిలు లేకుండా

మిగతా 2 లో

## డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయబోమ్
### తేల్చిచెప్పేసిన సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ బ్యూరో, జులై 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన పరీక్షలను వాయిదా వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయబోమని సీఎం రేవంత్

మిగతా 2 లో

# నిరుద్యోగుల నిరసనలు

### గ్రూప్-2 పరీక్షల వాయిదాకు నిరుద్యోగుల ఆందోళన
### షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే.. ఒక పరీక్ష కోల్పోతాం

- ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో అభ్యర్థులు నిరసన వ్యక్తం
- నిరుద్యోగులు, పోలీసుల మధ్య వాగ్వాదం
- ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం

రాష్ట్రంలో నిరుద్యోగుల నిరసనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు డిఎస్‌సి, గ్రూప్-1 అభ్యర్థులు పరీక్షల నిర్వహణ మార్పులు తమ గళం వినిపించగా, తాజాగా గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని కొందరు నిరుద్యోగులు హైదరాబాద్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలోనే చిక్కడపల్లి నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో భైఠాయించి మెరుపు నిరసన తెలియజేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో ఓ నిరుద్యోగి సొమ్మసిల్లి పడిపోయాడు. అభ్యర్థుల ఆందోళనతో ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.





తెలంగాణ బ్యూరో జులై 13 (తీన్మార్ న్యూస్): ప్రస్తుతం ఉన్న షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే నిరుద్యోగులు గ్రూప్ 2 లేదా గ్రూప్ 1కు మాత్రమే సిద్ధం కావాల్సి వస్తుందని, ఒక పరీక్ష కోల్పోవటం జరుగుతుందని వాపోయారు. గ్రూప్ 2, గ్రూప్ 3 షెడ్యూల్ ఒకే సమయానికి ఉండటం వల్ల అలాగే ఈ రెండింటి పోస్టులు పెంచాలని డిమాండ్

మిగతా 2 లో



### ఒకే రోజు ఒకే పరీక్షా కేంద్రంలో డిఎస్సి పరీక్షలు రాసే అవకాశం

ఈ మేరకు విద్యాశాఖ అధికారుల నిర్ణయం

.. వివరాలు 2లో



### డ్రగ్స్ అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహం

- అన్ని హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు
- విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ

.. వివరాలు 2లో



## ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆటోని "ఢీ"కొన్న కంటైనర్
### ముగ్గురు అక్కడికక్కడే మృతి, ఒకరికి తీవ్ర గాయాలు





ములుగు, జులై 13 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏటూరునాగారం సమీపంలో 163 జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. కాగా మృతులు వాజేడు మండలానికి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన వారిలో కాకర్లపూడి సత్యనారాయణ రాజు, భార్య సత్యవతి ఉన్నారు. అయితే తమ కూతురు అనితను వైజాగ్ వెళ్లేందుకు బస్ ఎక్కించడం కోసమని

మిగతా 2 లో

## రైళ్ల రద్ధికి ప్రత్యామ్నాయంగా చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి

హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉంటోంది. ప్రయాణికుల రద్దీ రోజురోజుకు తీవ్రమవుతుండటంతో రైళ్లను నియంత్రించలేకపోతున్న అధికారులు ప్రత్యామ్నాయంగా

మిగతా 2 లో





### విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి
## ప్రత్యామ్నాయంగా హైడ్రా

హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగానికి ప్రత్యామ్నాయంగా కొత్తగా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ (ప్రొటెక్షన్) వ్యవస్థ ఉనికిలోకి రానున్నది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులతో పాటు నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, అక్రమంగా వెలిసిన నిర్మాణాలు కూల్చివేయడం, ఆక్రమణలను

మిగతా 2 లో

### దాసరి మల్లమ్మకు
## నోటీసులు..
### స్పందించిన మంత్రి సీతక్క

ఆసరా పెన్షన్ తిరిగి చెల్లించాలంటూ అధికారుల నోటీసులు



హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): ఆసరా పెన్షన్‌ను తిరిగి చెల్లించాలంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన దాసరి మల్లమ్మ అనే వృద్ధురాలికి అధికారులు నోటీసులు ఇవ్వడంపై మంత్రి సీతక్క స్పందించారు. కొత్తగూడెం మున్సిపాలిటికి చెందిన దాసరి మల్లమ్మకు 2014 నుంచి ఆసరా పెన్షన్ అందుతోందని తెలిపారు. అయితే దాసరి మల్లమ్మ కుమార్తె రాజేశ్వరి వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం గా పనిచేస్తూ మరణించగా, ఫ్యామిలి పెన్షన్ కింద నెలకు రూ. 24,073 పెన్షన్ మల్లమ్మకు అందుతోందని మంత్రి పేర్కొన్నారు. మల్లమ్మ ఇద్దరు కుమారుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా మరొకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారన్నారు. కుమారుడితో పాటు సొంత పక్కా ఇంట్లో మల్లమ్మ నివసిస్తుందని అయితే ఒకే వ్యక్తి రెండు

మిగతా 2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు సీబిఐకి ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ
- రుణమాఫీని వెంటనే అమలు చేయాలి
- 15 అంశాలతో బీజేపీ రాజకీయ తీర్మానం




హైదరాబాద్, జులై 13 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, ఫోన్ ట్యాపింగ్ కేసులను తక్షణమే సీబీఐకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్తు

మిగతా 2 లో

## గద్దెనెక్కిన తర్వాత గర్వంగా వ్యవహరిస్తే.. కేసీఆర్ గతే..

### నియామకాలు చేపట్టాలని ప్రశ్నిస్తే అణిచివేయడం విచారకరం
### నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వ వైఖరి పట్ల ఈటల విమర్శలు

తెలంగాణ బ్యూరో, జులై 13 (తీన్మాట్ న్యూస్): నిరుద్యోగుల ఆశలను తెలంగాణ ప్రభుత్వం అడియాశలు చేసిందని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర అవుట్సోర్సింగ్ ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేస్తుందని నమ్మి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారని, ఇప్పుడు ఉద్యోగాలే భర్తీ చేయాలేని పరిస్థితి నెలకొందని అన్నారు. నియామకాలు చేపట్టాలని ప్రశ్నించే వారిని అణిచివేయడం విచారకరమని పేర్కొన్నారు. గద్దెనెక్కిన

మిగతా 2 లో



## ఒకే రోజు ఒకే పరీక్షా కేంద్రంలో డీఎస్సీ పరీక్షలు రాసే అవకాశం

తెలంగాణ బ్యూరో, జులై 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 18వ తేదీ నుంచి డీఎస్సీ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఒకే రోజు రెండు సబ్జెక్టుల పోస్టులకు సంబంధించిన డీఎస్సీ పరీక్షలు ఉండే అభ్యర్థులు ఉదయం పరీక్ష రాసిన చోటే రెండో పరీక్షకు హాజరుకావొచ్చని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ విషయంపై అధికారులు అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. అయితే కొందరు అభ్యర్థులకు ఉదయం ఒక జిల్లాలో మధ్యాహ్నం మరో జిల్లాలో పరీక్షలు ఉన్నాయి. నాన్‌లోకల్ పోస్టులకు దరఖాస్తు చేయడంతో ఇతర జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు వచ్చాయి. దాంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న విద్యాశాఖ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటి వారు ఒకే రోజు ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇక వారికి హాల్‌టికెట్లు మార్చి ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఒక సబ్జెక్టు తెలుగు, అదే సబ్జెక్టు హిందీ మాధ్యమానికి దరఖాస్తు చేసి ఉంటే ప్రధాన మాధ్యమంలో వచ్చిన మార్కులను రెండో దానికి కూడా పరిగణనలోకి తీసుకుంటామని విద్యాశాఖ వెల్లడించింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11,062 టీచర్ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దాదాపు 2.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులు హాల్‌టికెట్స్‌ను కూడా ఇప్పటికే విడుదల చేశారు.

## డ్రగ్స్ అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహం

తెలంగాణ బ్యూరో, జులై 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లు ఏర్పాటుచేయనున్నారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉంటాడు. వైస్ ప్రెసిడెంట్ గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసు లో ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్ పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉంటారు. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ క్లబ్ లు ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే పూర్తి గైడ్ లైన్స్ విడుదల చేయనుంది.

## రైళ్ల రద్దీకి ప్రత్యామ్నాయంగా చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి
చర్లపల్లి రైల్వేస్టేషన్ ను అభివృద్ధి చేస్తున్నారు. అతి త్వరలోనే జంటనగర వాసులకు ఇది అందుబాటులోకి రాబోతోంది. రూ.434 కోట్ల బడ్జెట్ తో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే తెలంగాణలో నాలుగో అతిపెద్ద రైల్వేస్టేషన్ గా చర్లపల్లి నిలవబోతోంది.

**పూర్తికావొచ్చిన చర్లపల్లి**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. అతి త్వరలోనే దీన్ని ప్రారంభించబోతున్నారు. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి ట్విటర్ వేదికగా స్టేషన్ ఫొటోలను షేర్ చేశారు. తొమ్మిది ప్లాట్ ఫామ్స్ తో ఉన్న చర్లపల్లి రైల్వేస్టేషన్ అందుబాటులోకి వస్తే ఇతర స్టేషన్లపై రద్దీ తగ్గుతుందని, అలాగే ఎంఎంటీఎస్ రైళ్లు, దూర ప్రాంతాలకు ప్రయాణించే రైళ్ల మధ్య మారడానికి ఇది వీలు కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో ప్రస్తుతం పునర్మిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిని శరవేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**దూర ప్రాంత రైళ్లు ఇక్కడి నుంచే**

ప్రస్తుతం ఇక్కడినుంచి ఆరు ఎక్స్ ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. త్వరలోనే మరో 12 రైళ్లను ఇక్కడ ఆపేందుకు అనుమతులు రావడంతో దానికి సంబంధించిన విధివిధానాలను అధికారులు రూపొందిస్తున్నారు. ఈ స్టేషన్ ను ఎప్పటి నుంచి వినియోగించుకోవాలనే విషయాన్ని రైల్వే బోర్డు స్థానికంగా ఉన్న అధికారులకే కట్టబెట్టడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. లింగంపల్లి నుంచి నడిచే కొన్ని రైళ్లను సికింద్రాబాద్ స్టేషన్ కు వచ్చే అవసరం లేకుండా సనత్ నగర్, మౌలాలి మీదుగా చర్లపల్లి చేరుకునేలా తిప్పబోతున్నారు. పశ్చిమబెంగాల్, ఒడిసా, బీహార్, ఢిల్లీ లాంటి దూరప్రాంతాలకు ప్రయాణించే రైళ్లను చర్లపల్లి నుంచి నడపబోతున్నారు.

## దాసరి మల్లమ్మకు నోటీసులు.. స్పందించిన మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి
రకాల పెన్షన్లు తీసుకోవడానికి నిబంధనలు అంగీకరించవని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధాప్య, ఫ్యామిలి పెన్షన్లను 1826 మంది పొందుతున్నట్లు ట్రెజరీ శాఖ ఈ మధ్యనే గుర్తించి వారందరికి రికవరీ నోటీసులు పంపింది. ఆ ప్రక్రియలో భాగంగానే వృద్ధాప్య, ఫ్యామిలి పెన్షన్లను అందుకుంటున్న దాసరి మల్లమ్మకు సైతం అధికారులు నోటీసులు పంపారు. వాస్తవాలు ఈ రకంగా ఉంటే, ప్రభుత్వం మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఎందరో అర్హులకు పెన్షన్లు అందించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఒక పంట కూడా సరిగా పండని అడవిలో కొండలు, గుట్టలతో కూడిన పోడు భూమి 5 ఎకరాలకు మించి ఉందన్న కారణం చూపి ఇచ్చిన పెన్షన్లను గత ప్రభుత్వం రద్దు చేసిందని సీతక్క తెలిపారు. ఆటోలు, కార్లు నడుపుకుని బతికే కుటుంబాలకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్లకు కోతలు పెట్టిందని కానీ తమ ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచిస్తోందని మంత్రి తెలిపారు. అర్హులందరికి పెన్షన్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం ప్రతి పైసా అర్హులకే దక్కాలన్నది తమ ప్రభుత్వ సంకల్పం అన్నారు. అందులో భాగంగానే లీకేజీలను అరికట్టడంతో పాటు ఎప్పటికప్పుడు లబ్దిదారుల జాబితాను అప్ డేట్ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ.. సంక్షేమ ఫలాలు అర్హులకు, అవసరం ఉన్నవాళ్లకే దక్కేలా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ మానవీయకోణంలో పాలన సాగిస్తున్నామని చెప్పారు. దాసరి మల్లమ్మ విషయంలో రెండు రకాల పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిబంధనలు అంగీకరించవన్న విషయాన్ని గుర్తెరిగి వ్యవహరించాలని కోరుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు సీబిఐ కి ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి
కొనుగోలు అంశంలో జ్యుడీషియల్ కమిషన్ దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొంది. రుణమాఫీ వెంటనే అమలు చేయాలంది. రైతుభరోసా కింద రైతులకు రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు 15 అంశాలతో రూపొందించిన రాజకీయ తీర్మానాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రవేశపెట్టగా, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్‌రావు బలపరిచారు. విద్యార్థి, యువ వికాసం గ్యారెంటీలను అమలు చేసి ప్రోత్సాహకం అందించాలి. శాంతి భద్రతలను కాపాడాలి. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలి. ధరణిని ప్రక్షాళన చేయాలి. ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి. గొర్రెల స్కాంలో అవినీతిపరులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి. ఇసుక, గ్రానైట్, డ్రగ్స్, లిక్కర్ మాఫియాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి. రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి. ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలి. ఫీజు రీఇంబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలి అని బీజేపీ తీర్మానంలో డిమాండ్ చేసింది.

## ఎస్పీఎఫ్ చేతుల్లోకి వెళ్లనున్న తెలంగాణ సెక్రటేరియట్ భద్రత..?

మొదటి పేజీ తరువాయి
స్పెషల్ పోలీస్ (టిజిఎస్పీ) ఈ విధులను నిర్వహిస్తోంది. అయితే టిజిఎస్పీ కింద విధులు నిర్వహించే అధికారులు, కాంగ్రెస్ నాయకులను, ఎమ్మెల్యేలను గుర్తించకపోవడం వారి పట్ల నిర్లక్షంగా వ్యవహరించడం, వారిని సచివాలయంలో లోపలికి రాకుండా అడ్డుకోవడం తదితర కారణాలతో టిజిఎస్పీని తప్పించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలిసింది.

**హోంశాఖ నుంచి లైన్‌క్లియర్**

అయితే ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ కొత్త సెక్రటేరియట్ ప్రారంభోత్సవం వరకు ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది ఇక్కడ భద్రతా విధులను నిర్వహించేవారు. గతంలో ఎస్పీఎఫ్ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడం, కొన్ని ఫైల్ మూమెంట్ వారి కనుసన్నల్లోనే జరుగుతుందన్న ఆరోపణల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఎస్పీఎఫ్‌ను సచివాలయ భద్రత నుంచి తప్పించి టిజిఎస్పీకి ఆ బాధ్యతలను అప్పగించినట్టుగా తెలిసింది. ప్రస్తుతం 450 మందితో షిఫ్టుల వారీగా సచివాలయం భద్రతకు పహారాగా ఉన్న తెలంగాణ స్పెషల్ పోలీస్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ పోలీస్, ట్రాఫిక్, సాయుధ రిజర్వ్ పోలీసులు కలిపి మొత్తం సెక్రటేరియట్ భద్రతలో 650 మంది పాలుపంచుకుంటున్నారు. దీంతోపాటు సుమారు 300 పైగా సిసి కెమెరాలతో నిఘా నీడలో సెక్రటేరియట్ భద్రతను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గతంలో ఎస్పీఎఫ్ బాధ్యతల్లో కీలకంగా ఉన్న ప్రస్తుత హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, తాజా మాజీ డిజిపి రవి గుప్తా ఎస్పీఎఫ్‌కు లైన్ క్లియర్ చేశారని, ఈ నేపథ్యంలోనే సిఎం వద్దకు సెక్యూరిటీ మార్పు ఫైల్ వచ్చిందని, ఇంటెలిజెన్స్ నివేదిక అనంతరం సెక్రటేరియట్ భద్రతకు సంబంధించి సిఎం ఎస్పీఎఫ్ భద్రతపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టుగా తెలిసింది.

# నిరుద్యోగుల నిరసనలు

మొదటి పేజీ తరువాయి
చేశారు. గ్రూప్ 2 డిసెంబర్‌లో నిర్వహిస్తే గ్రూప్ 1 మెయిన్స్‌కు ప్రిపరేషన్‌కు టైమ్ ఉంటుందన్నారు. ఈ ధర్నాకు భారీస్థాయిలో నిరుద్యోగులు హాజరై తమ నిరసనను తెలిపారు. డిఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు వాయిదా వేయడం కుదరని, షెడ్యూల్ ప్రకారం యధావిధిగా పరీక్షలు జరుగుతాయని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలపై నిరుద్యోగులు భగ్గుమన్నారు. సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంచడంతో పాటు, డిఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని మరోసారి డిమాండ్ చేశారు.



నిరుద్యోగులతో పెట్టుకోకుండా తమ సమస్యలు వెంటనే పరిష్కారించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగుల ఆందోళనతో అశోక్ నగర్‌లో వాహనాలు ఎక్కడికక్కడే స్తంభించిపోయి, భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, పోలీసుల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ తమ వెనుకాల ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు. కావాలని కొందరు సీఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సమాచారం అందిస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్ - 1 మెయిన్స్‌కు 1:100 పిల్వాలని, దాంతో పాటు గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంచాలని, డిఎస్‌సిని మూడు నెలల పాటు వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## ఎలాంటి పెండింగులు లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వేస్తాం

మొదటి పేజీ తరువాయి
ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఇక బకాయిలను కూడా వన్ టైం సెటిల్మెంట్ చేసేలా మంత్రి శ్రీధర్ బాబుకు బాధ్యతలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఆర్థిక శాఖతో మాట్లాడి ఓ కొలిక్కి తీసుకొచ్చేలా చూడాలని శ్రీధర్ బాబుకు విన్నవించారు. ఇక అభివృద్ధి చెందుతున్న దేశానికి సివిల్ ఇంజినీరింగ్ అత్యంత అవసరం. కొన్ని కళాశాలల్లో ఆ కోర్సు లేకుండా చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నడపాలి. ఈ కోర్సులు లేకుంటే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. విద్యా సంస్థలు పట్టాలు చేతిలో పెట్టి నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా మారడం తమ ప్రభుత్వానికి ఏమాత్రం సమర్థనీయం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో కాలేజీలు ప్రపంచ అవసరాలకు తగినట్టుగా సరికొత్త ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. అందుకు తమ ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచానికి నడిపించబోతోందని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో ఏఐకి సంబంధించిన కోర్సును ప్రవేశపెట్టాలని ఇందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడేలా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మా ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం తెలిపారు. ఇంజనీరింగ్ విద్యను మరింత పటిష్టం చేసి, ఉన్నత నాణ్యతా ప్రమాణాల స్థాయికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. ఆ దిశగా అడుగులు వేస్తూ ప్రాథమిక స్థాయిలో 65 ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్న విషయాన్ని వివరించారు. తెలంగాణ ఆకాంక్షకు ప్రధాన కారణమైన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉందని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు చిక్కులు, ఇతర గందరగోళాలను పరిష్కరించి ఇప్పటిదాకా 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామన్నారు. టీజీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతోందని ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల భర్తీ, డీఎస్సీ ద్వారా టీచర్ల భర్తీ ప్రక్రియలోనూ నిబంధనల ప్రకారం, కోర్టు చిక్కులు తలెత్తకుండా, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా స్పష్టమైన విధానంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, విద్యాశాఖ కార్యదర్శి, జెన్‌టీయూ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ బుర్రా వెంకటేశం, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయబోమ్

మొదటి పేజీ తరువాయి
తేల్చిచెప్పారు. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను చిన్న సమస్య కూడా రాకుండా నిర్వహించామని చెప్పారు. చిన్న చిన్న విషయాల్లో కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరించామని తెలిపారు. గతంలో గ్రూప్ -1కు ప్రిలిమ్స్ పరీక్ష సమయంలో బయోమెట్రిక్ తీసుకుంటామని చెప్పి తీసుకోకపోవడంలో కోర్టు పరీక్షను రద్దు చేసిందని గుర్తుచేశారు. అందుకే నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అంశాల ఆధారంగానే పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను విజయవంతంగా నిర్వహించి.. ఫలితాలను కూడా విడుదల చేశామని తెలిపారు. గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తామని పేర్కొనడం జరిగిందని చెప్పారు. అది గత ప్రభుత్వ హయాంలోనే తీసుకున్న నిర్ణయమని.. తాము కూడా అదే గైడ్ లైన్స్‌లో నోటిఫికేషన్ ఇచ్చామని అన్నారు. 1:50కి బదులు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేయడం వల్ల తనకు గానీ, ప్రభుత్వానికి గానీ ఎలాంటి నష్టం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 1:100 ఎంపిక చేస్తున్నామని పేర్కొంటే వెంటనే కోర్టు పరీక్షను కొట్టివేస్తుందని అన్నారు. గత పద మూడేళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. దీంతో ఎంతో మంది నష్టపోయారని చెప్పారు. అందుకే వీటన్నింటిని దృష్టిలో పెట్టుకునే నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అంశాల ఆధారంగానే ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పరీక్షలు వాయిదా వేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమి లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగాలే లక్ష్యంగా తెలంగాణ కోసం కొట్లాడామని.. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని కొట్లాడామని.. అయితే ఇప్పుడు గ్రూప్ 1,2,3, డీఎస్సీ పరీక్షలను ఒకదానితో ఒకదానికి ఇబ్బంది లేకుండా నిర్వహిస్తుంటే వాయిదా వేయాలని కొట్లాడుతుండటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. డీఎస్సీకి రెండేళ్ల కిందట నోటిఫికేషన్ వచ్చిందని పలుమార్లు పరీక్ష వాయిదా పడుతూ వచ్చిందని.. ఇప్పుడు పరీక్ష దగ్గరకు వచ్చేసరికి వాయిదా వేయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని మరి రెండేళ్లలో పిల్లలు చదువుకోలేదా.. అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తామేమి సిలబస్ మార్చలేదని, పరీక్ష విధానాన్ని మార్చలేదని చెప్పారు. కొన్ని రాజకీయ శక్తులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వారికి నష్టం జరుగుతుందనే ఉద్దేశంలో పరీక్షలను వాయిదా వేయాలని కోరుతున్నారని ఆరోపించారు. పరీక్షలు నిర్వహిస్తే ఉద్యోగాలు వచ్చివారు ఉద్యోగాల్లో చేరతారని, రానివారు ఇతర మార్గాలను చూసుకుని జీవితంలో ముందుకు సాగుతారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అదే పరీక్షలు వాయిదా వేస్తే నిరుద్యోగులు అలాగే ఎదురు చూస్తూ ప్రిపేర్ అవుతుంటారని, ఇది కోచింగ్ సెంటర్లకు ఆదాయం తెచ్చిపెడుతుందని విమర్శించారు. పరీక్షలు వాయిదా వేయాలని ముగ్గురు దీక్ష చేస్త అందులో ఒక్కరు కూడా ఏ పరీక్ష రాయట్లేదని తెలిసిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో ఉద్యోగాల నోటిఫికేషన్స్‌కు సంబంధించి జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పారు. ప్రతి సంవత్సరం మార్చి 31లోగా ప్రతి శాఖలో ఉండే ఖాళీల వివరాలను తెప్పించి జూన్ 2వ తేదీలోపు నోటిఫికేషన్లు ఇస్తామని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్దత కల్పిస్తామని చెప్పారు.

## విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ప్రత్యామ్నాయంగా హైడ్రా

మొదటి పేజీ తరువాయి
తొలగించడం, నిబంధనలకు విరుద్ధంగా పుట్టుకొచ్చిన ఫ్లెక్సీలు, హోర్డింగులను తీసేయడం వంటివన్నీ ఇప్పుడు హైడ్రా చేపట్టనున్నది. హైదరాబాద్ సిటీ మొదలు ఔటర్ రింగు రోడ్డు వరకు సుమారు 2,000 చదరపు కి.మీ. మేర ఉన్న ప్రాంతమంతా దీని పరిధిలోకి రానున్నది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, ట్రాఫిక్ పోలీస్, సిటీ పోలీస్, విజిలెన్స్, విద్యుత్ తదితర పలు విభాగాల సమన్వయంతో ఈ కొత్త వ్యవస్థ పని చేయనున్నది.

**మెరుగైన సేవలు : సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్ నగర ప్రజల అవసరాలు, వారికి మెరుగైన సేవలందించేందుకు వీలుగా 'హైడ్రా' పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు చేయాలని భావించిన సీఎం దీని ఫంక్షనింగ్, నిర్వహణా వ్యవస్థ, సిబ్బంది సంఖ్య, విధివిధానాలు తదితరాలపై లోతుగా అధ్యయనం చేసి ముసాయిదా నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వ్యవస్థకు సంబంధించి అనేక అంశాలను వివరించి భవిష్యత్తులో ఎలా పనిచేయనున్నదో దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ మొదలు విద్యుత్ శాఖ వరకు అనేక విభాగాల సమన్వయంతో సమర్థవంతంగా పని చేసేలా ఉండాలని నొక్కిచెప్పారు. ఇప్పుడున్న ఈవీడీఎం విభాగాన్ని దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని వివరించారు.

**రెండు వేల చ.కి.మీ. పరిధిలో హైడ్రా పని**

హైడ్రా విభాగంలో ఏయే స్థాయి అధికారులుండాలి, ఎంత మంది సిబ్బంది ఉండాలి, ఏయే విభాగాల నుంచి డిప్యుటేషన్ మీద తీసుకోవాలి ఎక్కడెక్కడ జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి, ప్రజలకు నిత్యం కనెక్టివిటీలో ఉండేందుకు అనుసరించాల్సిన విధానం తదితర అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు దాదాపు 2 వేల చ.కి.మీ. పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుందని, ఆ పని విభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్దేశించాలని సీఎం సూచించారు. హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని అవసరాన్ని బట్టి పరిశీలించాలని, ఈ నెల చివరలో జరిగే అసెంబ్లీ సెషన్‌లోపే ముసాయిదా తయారు కావాలని సీఎం ఆఫీసర్లకు ఆదేశించారు.

**కీలకంగా వ్యవహరించేలా విధుల అప్పగింత**

విపత్తుల నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ఆక్రమణలను తొలగించడం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలు పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటనల తొలగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సప్లై తదితర అంశాలపైనా 'హైడ్రా' కీలకంగా వ్యవహరించేలా విధుల అప్పగింత ఉంటుందని సీఎం క్లారిటీ ఇచ్చారు. హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య నిత్యం సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు.

## ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



మొదటి పేజీ తరువాయి
బస్టాండ్ కు బయలుదేరారు. ఈ క్రమంలో ఆటోలో వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కూతురు అనితకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ తల్లండి నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మొత్తం ఆటోలో ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. పెనుమర్ల రాజిరెడ్డి అనే వ్యక్తికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి గల కారణమైన కంటైనర్ వాహనం సీజీ17కేజెడ్5900గా గుర్తించారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జాతీయరహదారిపై ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. అనంతరం మృతదేహాలను అక్కడి నుంచి మార్చురీకి తరలించారు.





## గద్దెనెక్కిన తర్వాత గర్వంగా వ్యవహరిస్తే.. కేసీఆర్ గతే..



మొదటి పేజీ తరువాయి
తర్వాత గర్వంగా వ్యవహరిస్తే కేసీఆర్‌కు పట్టిన గతి పడుతుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్ళు.. ప్రజల కోసం మాత్రమే పనిచేయాలని ఈటల సూచించారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే కార్మికుల కంటే బాధ్యతాయుతంగా ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని ఆర్ కృష్ణయ్య అన్నారు. నిత్యం పని ఒత్తిడి, తక్కువ వేతనాలతో సతమతమవుతున్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. మానవతా దృక్పథం కలిగిన ప్రభుత్వం వస్తే తమకు న్యాయం జరుగుతుందని, ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరీక్షిస్తున్నారని ఆర్ కృష్ణయ్య చెప్పారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## జమ్మూలో ఏం జరుగుతోంది...

జమ్ము మళ్లీ నెత్తురోడుతోంది. లోయలో మళ్లీ అలజడి పెరుగుతోంది. గన్‌లు మళ్లీ గ్యాప్ లేకుండా గర్జిస్తున్నాయి. మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇంతకీ జమ్మూలో ఏం జరుగుతోంది.. ? ఒక్కసారిగా ఈ వరుస దాడులు పెరగడానికి రీజన్ ఏంటి ?

మే 4.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కాన్వాయ్‌పై దాడి.. ఎంఈ సోల్జర్ విక్కి పహాడే మృతి.జూన్ 9.. రాయిసీలో భక్తుల బస్సులపై దాడి.. 9 మంది మృతి.. 42 మందికి గాయాలు.జూన్ 11.. బడేర్‌వాహ్‌లో దాడి.. ఐదుగురు జవాన్లు, ఓ పోలీసాఫీసర్‌కు గాయాలు.

జూన్ 12.. దోడాలోని టెంపరరీ ఆపరేటింగ్ బేస్‌పై దాడి.. ఓస్పెషల్ ఫోర్సెస్ కమాండోకు తీవ్రగాయాలు.. ఓ ఉగ్రవాది మృతి.జూన్ 26.. దోడాలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు జైషే ఇ మహ్మద్ టెర్రరిస్టుల ఏరివేత.ఈ లెక్కలు మొత్తం జమ్ము కశ్మీర్‌కు సంబంధించినవి కావు. జస్ట్ జమ్ములో మాత్రమే ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం ఇది. నిజానికి ముందు జమ్ములో ఎక్కువగా ఉగ్రదాడులు జరిగేవి. కానీ ఇప్పుడు జమ్ములో ఎక్కువగా అలజడి సృష్టిస్తున్నారు ఉగ్రవాదులు. దారుణమైన విషయం ఏమిటంటే.. ఒకానొక సమయంలో మూడు రోజుల్లో మూడు దాడులు చేశారు ఉగ్రవాదులు. దీంతో ఔఎం రంగంలోకి దిగింది.. ఇన్వెస్టిగేషన్ ప్రారంభించింది. కానీ.. ఈ దాడులు ఆగలేదు. మళ్లీ 24 గంటల తేడాతో మళ్లీ పలుచోట్ల ఉగ్రవాదుల అలజడి. గత ఆదివారం రాజౌరీలోని ఆర్మీ క్యాంప్‌పై దాడి.. ఓ సోల్జర్ మృతి. ఇది జరిగిన గంటల్లోనే కుల్గాం డిస్ట్రిక్ట్‌లో జరిగిన సపరేట్ ఎన్‌కౌంటర్స్‌లో ఆరుగురు టెర్రరిస్టులను మట్టుపెట్టింది ఆర్మీ. కానీ.. ఆ కాల్పుల్లో ఇద్దరు సోల్జర్స్ కూడా మృతి చెందారు. ఇది జరిగిన తర్వాత ఆర్మీ కాన్వాయ్‌పై దాడి చేశారు. ఐదుగురు జవాన్లు మృతి చెందారు.. ఆరుగురికి గాయాలయ్యాయి.నిజానికి ఇది చాలా సీరియస్ విషయం. ఒక్కసారిగా దాడులు ఎలా పెరిగాయి ? ఉగ్రవాదులు ఎలా సరిహద్దులను దాటి వచ్చారు ? వారికి ఎవరు షెల్టర్ ఇస్తున్నారు? స్థానికంగా సహాయం అందుతుందా ? ఆర్మీ వెహికల్స్ రూట్ మ్యాప్ ఎలా తెలుస్తుంది ? గెరిల్లా వార్ ఫేర్‌లో అంత ఎక్స్‌పర్ట్స్‌గా ఎలా మారారు ? కమాండో తరహా శిక్షణ ఎవరిచ్చారు ? అన్ని ప్రశ్నలే.. అయితే ఈ ప్రశ్నల పరంపర ఇక్కడితో ఆగడం లేదు. ఇప్పుడే ఈ దాడులు ఎందుకు చేస్తున్నారు ? ఈ దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ? ఇది ఏదైనా డైవర్షన్ ప్లానా ? ఆర్మీ అటెన్షన్ జమ్ముకు డైవర్ట్ చేసి ఇంకేదైనా పెద్దగా ప్లాన్ చేస్తున్నారా ? అనే ప్రశ్నలు ఇప్పుడు బుర్రను తొలిచేస్తున్నాయి.నిజానికి ఉగ్రవాదులు రాటు తేలారు. వారిని ఉగ్రవాదులు అనేకంటే.. స్పెషల్ ఫోర్స్ కమాండో ఎంత ట్రైనింగ్‌తో ఉంటారో.. అలా ఉగ్రవాదుల వ్యూహాలు ఉన్నాయని చెబుతున్నారు ఆర్మీ అధికారులు. జంగిల్ వార్ ఫేర్‌తో పాటు అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తున్నట్టు గుర్తిస్తున్నారు. దాడి చేయడం వెంటనే అడవుల్లోకి పారిపోవడం.. వారిని వేటాడటానికి వచ్చిన సైనికులను ట్రాప్ చేసి చంపేసే ఎత్తుగడలు కనిపిస్తున్నాయి. కథువాలో జరిగిన దాడిని చూస్తే ఇది అర్థమవుతోంది. మొదట ఆర్మీ కాన్వాయ్‌లోని డ్రైవర్‌ను టార్గెట్ చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే గ్రనైడ్ వేశారు.. దీని నుంచి తెరుకునే లోపే కాల్పులు ప్రారంభించారు. దీంతో బలగాలకు రియాక్ట్ అయ్యే టైమ్ కూడా దొరకలేదు. ఆ వెంటనే మళ్లీ అడవుల్లోకి పారిపోయారు.కాబట్టి వీరికి పాకిస్థాన్‌లో హైలెవల్‌లో ట్రైనింగ్ ఇచ్చినట్టు క్లియర్ కట్‌గా తెలిసిపోతుందంటున్నారు ఆర్మీ అధికారులు. అంతేకాదు జమ్ము కశ్మీర్ ప్రశాంతంగా ఉండటం దాయాది దేశానికి ఇష్టం లేనట్టు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది. ప్రస్తుతంఇండియా గ్రోత్ రేట్ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఇండియా అన్ని విషయాల్లో ఇంకా సక్సెస్ కాలేదు. దానికి జమ్మునే బెస్ట్ ఎగ్జాంపుల్ అని చెప్పకనే చెబుతున్నారు టెర్రరిస్టులు. అంతేకాదు జమ్ముకశ్మీర్‌లో త్వరలో ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది కేంద్రం. లేటెస్ట్‌గా ప్రధాని మోడీ లోక్‌సభలో కూడా అనౌన్స్ చేశారు. త్వరలో కశ్మీర్‌లో ఎలక్షన్స్ నిర్వహించి తీరుతామని.. ఈ విషయం ఉగ్రసంస్థలకు అస్సలు మింగుడు పడటం లేదు. అందుకే ఇంకా మేమున్నామని తమ అస్థిత్వాన్ని చాటుతున్నారు.మరి కేంద్రం వద్ద ఉన్న యాక్షన్ ప్లాన్ ఏంటి ? ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది ? ఈ ప్రశ్నకు తమ వద్ద సమాధానం ఉంది కానీ.. ప్రత్యేక కారణాల వల్ల బయటికి చెప్పలేమంటున్నారు ఆర్మీ అధికారులు. అయితే రెండు విషయాలపై ఆర్మీ ఫోకస్ చేసినట్టు కనిపిస్తోంది. అడవుల్లో నక్కి.. దాడులు చేస్తున్న ఉగ్రవాదులను ఏరివేయడం ఫస్ట్ చాయిస్ కాగా.. ఈ మధ్య యాక్టివ్ అయిన ఉగ్ర నెట్‌వర్క్‌ని కట్ చేయడం సెకండ్ చాయిస్‌లా కనిపిస్తోంది.

# నాసిరకం మరమ్మతులు పాఠశాలల భవన పైకప్పులకు చిల్లులు

- అమ్మపల్లి పాఠశాల భవనంలో వర్షపు నీరు
- నిధులే లక్ష్యంగా కాంట్రాక్టర్లు
- కాంట్రాక్టర్ల నుండి మామూళ్ల మత్తులో ఏఈ లు



వనపర్తి ప్రతినిధి, జూలై 13(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం శనివారం రోజు కురిసిన వర్షానికి అమ్మపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు నుండి చిల్లులు పడి వర్షపు నీరు కారుతుండడంతో భయాందోళనకు గురవుతున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అంతంత మాత్రపు వర్షాలకె పాఠశాల భవనం నుండి వర్షపు నీరు స్లాబ్ నుండి రావడంతో భయాందోళనకు గురవుతున్న పాఠశాల ఉపాధ్యాయుల తల్లిదండ్రులు. కాంట్రాక్టర్ తీసుకోవడం నామమాత్రంగా పాత భవనాలకు నాసిరకం పనులు చేసి కొత్త కల్లర్ పూత పూసి లక్షల్లో బిల్లులు స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా కాంట్రాక్టర్లు పన్నాగం పనుతున్నారు. అమ్మపల్లి గ్రామం తో పాటు చిలకటోని పల్లి మణిగిల్ల గ్రామాలలో ఇదే దుస్థితి ఏర్పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఇది గమనించని ప్రభుత్వ అధికారులు ఏఈలు చూసి చూడనట్టుగా మర్యాదలు తక్కువ లేకుండా మామూళ్ల విషయంలో మాట (మడమ తిప్పకుండా) తప్పకుండా వాళ్లకు చెప్పిన హామీలను (నెరవేరిస్తే) నెరవేరిచే కాంట్రాక్టర్లకే తీర్మానం కరపత్రాలను అందజేస్తూ మూడో కంటికి తెలియకుండా మామూళ్ల మత్తులో మునిగిపోతున్న ఏఈ అధికారులు. ఏఈ అధికారులు ఖండించి మామూలకు పాల్పడకుండా కాంట్రాక్టర్లతో క్రమబద్ధీకరణగా ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణాలు నిర్మిస్తే ఇలాంటి దుస్థితి ఏర్పడేది కాదని వివిధ గ్రామాల పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ ప్రజాప్రతినిధులు రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారు.

# స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కొత్త కాపు శివసేన రెడ్డి ని ఘనంగా సన్మానం

- అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జి.నరేష్ కుమార్



వనపర్తి ప్రతినిధి, జూలై 13(తీన్మార్ న్యూస్): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శివసేనారెడ్డిని గచ్చిబౌలి స్టేడియంలో వారి ఛాంబర్ లో ఘనంగా సన్మానించారు. అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జి.నరేష్ కుమార్ రెడ్డి యూత్ కాంగ్రెస్ జనరల్ ముఖ్య కార్యదర్శి యాదగిరి గౌడ్ ఈ కార్యక్రమంలో నరేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ గత ఐదు సంవత్సరాలలో తెలంగాణా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా ఎన్నో పోరాటాలు చేసి పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి వనపర్తి ఎంఎల్ఏ టికెట్ ను తేజించిన శివన్న కి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ పదవితో గౌరవం కల్పించినందుకు సిఎం రేవంత్ రెడ్డి కి వనపర్తి జిల్లా తరుపున ధన్యవాదాలు తెలుపారు. రాబోవు కాలంలో వనపర్తికి ఇంకా కొన్ని పదవులు తెచ్చి వనపర్తి అభివృద్ధికి ప్రభుత్వం తో అందరూ సహకరించవలసిందేనని నరేష్ కుమార్ రెడ్డి కోరారు.

# రాజపేట మండలంలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో భారీగా చేరికలు

- అభివృద్ధి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై చేరికలు
- పలువురు ప్రముఖులతో 500 మందికి పైగా పార్టీ ఫిరాయింపు
- ఎన్నికల ముందు నుండి తన మార్కు రాజకీయాలు చూపిస్తున్న బీర్ల శంకర్



రాజపేట, జూలై 13(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతినిధులు నాయకులు ముఖ్య కార్యకర్తలు సుమారు 500 మందికి పైగా శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి సమక్షంలో, ఎన్నికల ముందు నుండి రాజాపేట మండల ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న తన మార్కు రాజకీయం చూపుతున్న బీర్ల శంకర్ పర్యవేక్షణలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి భారీగా చేరికలు జరిగాయి. రాజాపేట లోని అతిథి గృహం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, జిల్లా నాయకులు పాండవుల భాను ప్రకాష్ గౌడ్, మాజీ డైరెక్టర్ ఆర్కాల గాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కాయితి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రేగు సిద్ధులు, నకిర్తి కనకరాజు, మాజీ ఉపసర్పంచ్ కలకోటి జంపయ్య, తెలంగాణ ఉద్యమ తొలి మలి దశ ఉద్యమకారుడు పుల్లంగారి సిద్దయ్య, సీనియర్ ఉద్యమకారులు బిల్ల శ్రీనివాసులు, బెడిద రాము, రేగు అనిల్, కోయ బాలరాజు, రేకులపల్లి ప్రభాకర్ రెడ్డి, రాపోలు మల్లారెడ్డి, రాపోలు మోహన్ రెడ్డి, హుస్సేన్, పెద్దోళ్ల కార్తీక్ ఇతర ముఖ్య నాయకులు ఆయా గ్రామాల నుండి తన అనుచర వర్గంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఆలేరు నియోజకవర్గంలో బీర్ల ఐలయ్య చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో తాము కూడా భాగస్వామ్యం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. బీర్ల బ్రదర్స్ రాజపేట మండలంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం తమకెంతో సంతోషంగా ఉందని మండలంలోని శాశ్వత సమస్యలు పరిష్కారం కానున్నాయని, అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు బీర్ల బ్రదర్స్ ద్వారా రాజపేట మండలానికి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ప్రజల ప్రాంత సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ వారందరూ నిరంతరం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరు బాలరాజు గౌడ్, నమిల కేదారి గౌడ్, అంజిరెడ్డి, బూరుగు రమేష్, బూరుగు శ్రీనివాస్, పెంటపర్తి సంతోష్ రెడ్డి, ఎర్రగుంట అనిల్, పాండవుల లక్ష్మణ్ గౌడ్, పాండవుల బసవరాజు గౌడ్, రావుల బాలయ్య, బాల చంద్రయ్య, యువజన విభాగ0 అధ్యక్షులు ఇంజ నరేష్, అంకతి బాలయ్య, ఆడెపు శ్రీశైలం, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, బల్ల యాదేశ్, నాగిర్తి రాజిరెడ్డి, బొద్దుల నగేష్, కరాటే బాలు, జాల తాజా మాజీ ఉపసర్పంచ్ గంధమల్ల నర్సింలు, మాజీ సర్పంచ్ ఇస్తారి, కాకల భరత్, నరిశెట్టి కనకయ్య, మాడోత్ విఠల్ నాయక్, రాంజీ నాయక్, బిర్రు లవన్, కాసోజు బ్రహ్మం, బత్తిని సుధాకర్, కళ్లెం పాండు, రంగ నరేష్ గౌడ్, చల్లూరు బొంతు సుధాకర్, నాగరాజు, ఆకిరెడ్డి రమేష్, బింగి రమేష్, మహిళా అధ్యక్షురాలు నాగారం రేణుక, సీనియర్ మహిళా నాయకురాలు విజయ భాయ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలే సుమలత, మసిరెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డితో పాటు బీర్ల బ్రదర్స్ అయిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాష్ట్ర సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి బీర్ల శంకర్ లను ఘనంగా స్వాగతం పలికి శాలువలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



# వనపర్తిని క్రీడాపర్తిగా మలిచేందుకు కృషి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి ప్రతినిధి, జూలై 13(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గౌరవ శ్రీ శివసేనరెడ్డి రాష్ట్రస్థాయిలో, ఎంఎల్ఏగా తాను నియోజకవర్గంలో క్రీడలకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను, సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరై శివసేన రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసు నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను నిరంతరాయంగా కృషి చేస్తూ గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు చురుకైన పాత్ర పోషిస్తు నేడు తెలంగాణ రాష్ట్రంలోనే గౌరవప్రదమైన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారమని ఆయన పేర్కొన్నారు.

# ఇంజ మహేష్ ను సన్మానించిన ప్రభుత్వ విప్ బీర్ల



రాజాపేట, జూలై 13(తీన్మార్ న్యూస్): భువనగిరి జిల్లా ఎం.ఈ. ఎఫ్ ఇన్చార్జిగా ఎన్నికైన ఇంజ మహేష్ మాదిగను శనివారం ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్లా ఐలయ్య శాలువతో సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, సీనియర్ నాయకులు బుడిగే పెంటయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఇంజ నరేష్ కాంగ్రెస్ మండల నాయకులు, గొల్లపల్లి రాంరెడ్డి, కోయ బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# బొందుగుల గ్రామంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





రాజాపేట, జూలై 13(తీన్మార్ న్యూస్): మండలం లోని బొందుగుల గ్రామంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శనివారం రోజు పర్యటించారు. గ్రామంలో సిసి రోడ్లను ప్రారంభించి, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు కుషాయిగూడ మీర్పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ఆధ్వర్యంలో తన మిత్రుల యొక్క రైస్ లవ్ ఫౌండేషన్ ధ్వారా సుమారు 94 మంది విద్యార్థుల కుటుంబాలకు 25కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఆ తర్వాత క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని చర్చి భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్పి గొల్లూరి రవి, గుట్ట రూలర్ సీఐ కొండలరావు, స్థానిక ఎస్సైఉపేందర్ యాదవ్ గ్రామ ప్రజలు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బియ్యం సహాయం



రాజపేట, జూలై 13(తీన్మార్ న్యూస్): రాజపేట మండల కేంద్రంలోని ఎలగందుల బుచ్చి రాములు ఇటీవల మరణించాగా శనివారం ఆ కుటుంబానికి రేగు సిద్ధులు రేగు ఫౌండేషన్ ద్వారా 50 కిలోల బియ్యాన్ని అందజేసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బిర్రు సుదర్శన్, కాసోజు సంపత్, కోయ బాలు, వనం నందు, బిర్రు సురేష్, ఎక్కలదేవి శ్రీహరి, నేమిలఉపేందర్, స్వర్గం బాలకిషన్, గోపి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న తూడీ బ్రదర్స్

వనపర్తి ప్రతినిధి, జూలై 13(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం, గట్ల ఖానాపూర్ గ్రామంలో, నిరుపేద కుటుంబానికి చెందిన చుక్క కురుమన్న అనారోగ్యంతో మృతి చెందగా సమాచారాన్ని గట్ల ఖానాపూర్ మాజీ ఎంపిటిసి దామోదర్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి బ్రదర్స్ పెద్దమందడి కాంగ్రెస్ సమన్వయకర్త తూడీ శ్రీనివాస్ రెడ్డి కి, సమాచారం తెలుపగా వెంటనే స్పందించి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ రూ,5000/- లు, దాన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేయడంతో కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలుపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపిటిసి దామోదర్, మరియు మాజీ సర్పంచ్ చింతకాయల వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు గొల్ల రవీందర్, చుక్క దామోదర్, మేకల వెంకటయ్య, చుక్క మహేష్, చుక్క రామకృష్ణ, చుక్క కిష్టన్న, మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, వీరి ద్వారా ఆర్థిక సాయం అందించారు. కుటుంబ



సభ్యులు ఎమ్మెల్యే మేగారెడ్డి, మరియు శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి ఆదేశానుసారం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**– అందజేసిన సాయి చరణ్ రెడ్డి**

వనపర్తి ప్రతినిధి, జూలై 13(తీన్మార్ న్యూస్): ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో, గంగారపు గాల్రెడ్డి మరణించాడు. ఇట్టి విషయం తెలుసుకున్న ఖిల్లా ఘనపూర్ సింగల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, వెంటనే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి విషయం తెలుపగా, సానుకూలంగా స్పందించిన టి.మేగా రెడ్డి, మరణించిన వ్యక్తి దాన సంస్కరాలకు సాయం వెంటనే అందించాలని, సింగల్ విండో డైరెక్టర్ సాయిచరణ్ రెడ్డికి ఆదేశించడంతో వెంటనే స్పందించిన సాయి చరణ్ రెడ్డి, మృతుని కుటుంబాన్ని పరామర్శించి దాన సంస్కారాల నిమిత్తం రూ. 5000/- మృతునికి కుమారునికి అందజేశారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేసిన సాయి చరణ్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండమని ఓదార్చరు. ఈ కార్యక్రమంలో



మునగాల బాబు, మాజీ ఉప సర్పంచ్ యాదగిరి, సత్తిరెడ్డి, గంగారపు చిన్న తిరుపతి రెడ్డి, గంగారపు రాజారెడ్డి, గంగారపు పెద్ద తిరుపతిరెడ్డి, గంగారపు రామ్ రెడ్డి, గోనెల కృష్ణయ్య, గంగారపు మల్లేష్ రెడ్డి, శ్రీ వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేయాలి

**– సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్**

యాచారం, జూలై 13(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. యువజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఎన్నికల హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నింటికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ నియమకాలు వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేయకుండా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలు చేపట్టాలన్నారు. గ్రూప్స్ పోస్టులను పెంచి భర్తీ



చేయలన్నారు. అదేవిధంగా గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరీల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వలేదని, ఉద్యోగ నియామక పత్రాలు అందుకొని దాదాపు నాలుగునెలలు గడుస్తున్నా వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కవితకు బెయిల్... అప్పుడేనా

హైదరాబాద్, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కారాగార వాసం ఇప్పట్లో ముగిసే అవకాశం కనిపించడం లేదు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మార్చి 15న కవితను హైదరాబాద్‌లోని ఆమె ఇంట్లో అరెస్టు చేసింది. తర్వాత ఢిల్లీకి తరలించి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచింది. కోర్టు రిమాండ్ విధించడంతో నాలుగు నెలలుగా తీహార్ జైల్లో ఉంటుంది.అరెస్టై ఐదు నెలలు కావస్తున్న ఆమెకు ఇంతవరకు బెయిల్ దొరకలేదు. కవిత పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కానీ ప్రతీసారి దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వ్యతిరేకిస్తున్నాయి. చార్జిషీటు దాఖలు చేసినా కవితకు బెయిల్ ఇవ్వొద్దని కోర్టులకు విన్నవిస్తున్నాయి. దర్యాప్తు సంస్థల వాదనలతో న్యాయమూర్తులు కూడా ఏకీభవిస్తున్నారు. దీంతో కవిత బెయిల్ ఆశలు ఆవిరవుతున్నాయి. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంతోపాటు, ఢిల్లీ హైకోర్టులో బెయిల్ కోసం కవిత తరపు న్యాయవాదులు పలుమార్లు పిటిషన్ వేశారు. ఇక్కడ నిరాశ ఎదురుకావడంతో ఈసారి సుప్రీంకోర్టు తలుపు తట్టే యోచనలో ఉన్నారు. తీహార్ జైల్లో కవితను కలిసి ఎందుకు వెళ్లిన కేటీఆర్, హరీశ్‌రావు ఈ మేరకు సూచనలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ పెద్దలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.కవిత బెయిల్.. కేజ్రీవాల్ బెయిల్‌తో ముడిపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన తర్వాతనే కవితకు బెయిల్ వచ్చేందుకు మార్గం సుగమం అవుతుందని న్యాయనిపుణులు చెబుతున్నమాట. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఆయనకు కింది కోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిని దర్యాప్తు సంస్థలు హైకోర్టులో సవాల్ చేశాయి. హైకోర్టు బెయిల్‌కు బ్రేక్ వేసింది. ప్రస్తుతం ఆయన సుప్రీంకోర్టులో బెయిల్ కోసం పోరాడుతున్నారు. సుప్రీంకోర్టులో ఆయనకు బెయిల్ వస్తే కవిత కూడా అదే మార్గం అనుసరించే అవకాశం ఉంది.లిక్కర్ స్కాంలో అప్రూవర్లుగా మారిన వారికి మాత్రమే ఇప్పటివరకు న్యాయస్థానాలు బెయిల్ ఇచ్చాయి. ఢిల్లీ డిప్యూటీ సీఎంగా సిసోడియా అరెస్ట్ అయి ఏడాది దాటి పోయింది. అప్రూవర్‌గా మారకపోవడంతో ఆయనకు బెయిల్ రాలేదు. కవిత, కేజ్రీవాల్ కూడా అప్రూవర్‌గా మారడానికి అంగీ కరించడం లేదు. దీంతో దర్యాప్తు సంస్థలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి.

# మాది రైతుల మేలు కోరే ప్రభుత్వం...

ఖమ్మం: రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా నేడు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తేంది మంత్రుల బృందం. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులూటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఉన్నారు. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్?ను రూపొందించారు.తెలంగాణ సర్కార్ రైతు భరోసాపై దూకుడు పెంచింది. కేబినెట్ సబ్‌కమిటీ జిల్లాల పర్యటన మొదలుపెట్టింది. ఇవాళ ఖమ్మంజిల్లా కలెక్టరేట్‌లో రైతు భరోసాపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

# ఐటీ పేయర్స్ కు నో రుణమాఫీ

హైదరాబాద్, ఆగస్టు 15లోగా ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుల రుణాలు మాఫీ చేయాలని సంకల్పించిన తెలంగాణ ప్రభుత్వం..అందుకు తగ్గట్లుగా లబ్ధిదారుల ఎంపికపై ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. పేద రైతులెవ్వరూ నష్టపోకూడదంటూనే...అనర్హులకు సైతం ఒక్కపైసా ముట్టచెప్పకూడదని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను గట్టిగానే హెచ్చరించారు. దీంతో రైతు రుణమాఫీమార్గదర్శకాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆదాయపన్ను చెల్లింపుదారులను రాజకీయ నేతలను, ప్రభుత్వ ఉద్యోగులను మినహాయించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఐటీ రిటర్న్ దాఖలు చేసే రైతులు, చిరు ఉద్యోగులను మాత్రం ఇందులో నుంచి మినహాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.రైతు రుణమాఫీకి అర్హత పొందే లబ్ధిదారుల లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమైన వ్యవసాయశాఖ అధికారులు...పకడ్బందీగా మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. దీని ప్రకారం అసలు రాష్ట్రంలో ఐటీ కడుతున్న వారు ఎంతమంది..? పన్ను కట్టకపోయినా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేస్తున్న వారు ఎంతమంది..? అనే వివరాలను కేంద్రం నుంచి తెప్పించుకున్నారు.

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ పథకంలోనూ ఐటీ చెల్లింపుదారులు, రాజకీయ నేతలను మినహాయించారు. ఈక్రమంలోనే పన్ను చెల్లించేవారిని రుణమాఫీ నుంచి మినహాయించే అవకాశం ఉంది. అయితే పిల్లల చదువుకోసం, ఇంటి నిర్మాణం కోసం రుణాలు తీసుకున్న కొందరు రైతులు...పన్నులు చెల్లించకున్నా ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్నారు. ఇలాంటి వారికి రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పీఎం-కిసాన్ పథకం మార్గదర్శకాలనే దాదాపు రైతురుణమాఫీకి వర్తింపజేసే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఎక్కువ జీతం తీసుకునేవారిని మినహాయించి...చిరుద్యోగులకు మాత్రం రుణమాఫీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే గత ప్రభుత్వాలు అందరికీ రుణమాఫీ వర్తింపజేయడం వల్ల ప్రజాధనం వృధాకావడమే గాక...ప్రభుత్వంపైనా భారం పడింది. అందుకే ఈసారి బడాబాబులకు , రాజకీయ నేతలను మినహాయించడం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మరింత న్యాయం చేయాలని రేవంత్‌రెడ్డిప్రభుత్వం భావిస్తోంది. రెండు రోజుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల కానున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం రైతురుణమాఫీ( అమలకు ఆగస్టు 15 డెడ్‌లైన్‌గా పెట్టుకుంది. రెండు, మూడురోజుల్లో మార్గదర్శకాలతో కూడిన జీవో విడుదల కానుంది. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి స్వీకరించనున్నారు. రైతు రుణాలు మాఫీకి దాదాపు 31వేల కోట్లు అవసరం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే కొంత నిధులు సేకరించిన ప్రభుత్వం..ఈనెల రోజుల్లోనే మిగిలిన నిధులను సమకూర్చుకోనుంది. అటు లబ్ధిదారుల ఎంపికపైనా బ్యాంకులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. రేషన్‌కార్డు, సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రైతుల గుర్తింపు జరుగుతోంది. ఆధారాకార్డుల ద్వారా నెంబర్లు సరిచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికలహామీలో రైతురుణాలమాఫీ అంశం అత్యంత కీలకమైనది.అధికారంలోకి వచ్చిన అర్హులైన లబ్ధిదారులందరికీ 2 లక్షల రూపాయల వరకు రుణాలు మాఫీ చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. రుణమాఫీ అంశం గత ఎన్నికల్లో కీలకంగా మారింది.ఒకరకంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంతో ఉపయోగకరమైన ఈ హామీని అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఎంత ఖర్చు అయినా వెనకాడేది లేదని తేల్చిచెప్పారు. ఆగస్టు 15 కల్లా రైతుల రుణాలు మాఫీ చేస్తానంటూ డెడ్‌లైన్ విధించారు.

# నీట్ పేపర్ సూత్రధారి రాకీ అరెస్ట్

పాట్నా, దేశ వ్యాప్తంగా సంచలనం రేసిన నీట్ యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేపర్ లీకేజీలో కీలక సూత్రధారిని సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ మేరకు అనుమానితుడు రాజేశ్ రంజన్ అలియాస్ రాకీ అనే వ్యక్తిని పట్నాలో మధ్నాహ్నం సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో బీహార్‌లోని పట్నాలో రెండు చోట్ల, కోల్‌కతాలోని మరికొన్ని ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించాయి. ఈ నేరానికి సంబంధించి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. నిందితుడిని విచారించేందుకుగాను స్థానిక కోర్టు 10 రోజుల పాటు సీబీఐ కస్టడీ విధించింది. ఈ కేసులో బుధవారం ఇద్దరిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు అరెస్టైన వారి సంఖ్య 12 మందికి దాటింది. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ రాకెట్‌పై దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన సీబీఐ ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ప్రథమ సమాచార నివేదికలో దాఖలు చేసింది. నీట్ పేపర్ లీకేజీకి హజారీబాగ్ స్కూల్‌తో సంబంధాలు ఉన్నాయని సీబీఐ వర్గాలు తెలిపాయి. అక్కడి నుంచి లీకైన పేపర్లు బీహార్‌కు చేరుకున్నాయని ఓ సీబీఐ అధికారి తెలిపారు. పేపర్ లీకైన క్రమాన్ని వివరిస్తూ? మే 5న జరగాల్సిన పరీక్షకు సంబంధించిన తొమ్మిది సెట్ల పేపర్లు భద్రపరిచేందుకు రెండు రోజుల ముందుగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు నీట్ యూపీ క్వశ్చన్ పేపర్లు చేరుకున్నాయి. అక్కడి నుంచి పరీక్ష కేంద్రంగా ఉన్న హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్‌కు రెండు సెట్‌లను తరలించారు. పాఠశాలకు చేరుకునేలోపు వాటికి వేసి ఉన్న సీల్స్ తొలగించి ఉన్నాయి. ప్రశ్న పత్రాలు సీల్ చేయని సమయంలో అక్కడ రాకీ ఉన్నట్లు ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. అతను ప్రశ్నలను ఫోటోలు తీసి వాటికి సమాధానాలు గుర్తించే ముఠాకు చేరవేశాడు. పేపర్‌కు సమాధానాలు గుర్తించిన తర్వాత నీట్ అభ్యర్థులతో బేరసారాలు చేసి, లక్షల్లో దోచుకున్నారు. రెండు దశాబ్దాలుగా పేపర్ స్కామ్‌లో పరారీలో ఉన్న ఈ రాకెట్‌లోని మరో కీలక వ్యక్తి సంజీవ్ ముఖియాతో కూడా రాకీ టచ్‌లో ఉన్నాడు. విచారణలో ప్రశ్నాపత్రం ఎందరికి చేరింది అనే విషయం బయటపడే అవకాశం ఉంది. ఇప్పటివరకూ రెండూ చోట్ల పేపర్ లీక్ అయినట్లు అధికారులు గుర్తించారు. అయితే పేపర్లు ఎక్కడి నుంచి లీక్ అయ్యాయో స్పష్టంగా తెలియనప్పటికీ, బ్యాంకు బ్రాంచ్ నుంచి స్కూల్ రవాణా చేస్తున్నప్పుడు మార్గం మధ్యలో పేపర్ బయటకు వచ్చి ఉంటుందని సీబీఐ వర్గాలు అనుమానిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశానికి ఈ ఏడాది మే 5వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షకు దేశ వ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత 67 మందికి ఫస్ట్ ర్యాంకులు రావడంతో ఒక్కసారిగా దేశమంతా షాక్‌కు గురయ్యారు. వీరిలో ఒకే కోచింగ్ సెంటర్‌లో 720 మార్కులు సాధించిన ఆరుగురికి ఫస్ట్ ర్యాంకులు వచ్చాయి. మరోవైపు ప్రశ్నాపత్రం ఆలస్యంగా అందించారన్న కారణంలో 1,563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం వివాదానికి దారి తీసింది. అయితే గ్రేస్ మార్కులు ఇచ్చిన వారందరికీ రీటెస్ట్ పెట్టి, కొత్త ర్యాంకులు ప్రకటించినా.. ప్రస్తుతం పేపర్ లీక్ వ్యవహారం తేలాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో నీట్ పరీక్ష మరోసారి పెట్టాలని డిమాండ్లు వస్తున్నప్పటికీ కేంద్రం మాత్రం.. లీకేజ్ స్థానికంగానే ఉందని చెబుతోంది. సోషల్ మీడియాలో పేపర్లు షేర్ చేయలేదని పేర్కొంటోంది. మరోవైపు ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ల విచారణను జులై 18కి వాయిదా పడింది.

# దుద్దిళ్ల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

మల్హర్ రావు: దుద్దిళ్ల కుటుంబంపై అర్ధరహితమైన, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని రుద్రారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదుకర్ చేసిన అనుచిత, అర్ధరహితమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించినట్లుగా తెలిపారు. మంథని నియోజకవర్గంలో రౌడి రాజకీయాలు, హత్యలు, అరాచకాలు, అక్రమ వసూళ్లకు కేరాఫ్ అడ్రస్ గా పుట్ట మధు నిలిచిపోయాడని, ఇందంతా నియోజకవర్గ ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. మంథని నియోజకవర్గంతోపాటు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న మంత్రి శ్రీధర్ బాబుకు వస్తున్న మంచి పేరును జీర్ణించుకోలేకనే అబద్ధపు ఆరోపణలు చేయడం సిగ్గుసేటన్నారు.

రాజకీయ ఉనికి కోసం, బిఆర్ఎస్ పెద్దల మెప్పు, మన్ననలు పొందడం కోసమే మధు ప్రెస్ మిట్స్ పెడుతున్నాడని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన అనంతరం జరిగిన ఎన్నికల్లో పేద బిడ్డను, పెంకుటింట్లో అంబలి తాగి, అటుకులు బుక్కీ పెరిగానని ప్రగల్బాలు పలికి ప్రజలను నమ్మించి గెలుపొందిన అనంతరం కోట్ల అక్రమ ఆస్తులు సంపాదించడం జరిగిందని ఆరోపించారు.పుట్ట కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో భయభ్రాంతులకు గురిచేసి, అడ్డొచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డుపై హతమార్చిన సందర్భాలు ఇంకా ప్రజలు మరచిపోలేదన్నారు. మంథని నియోజకవర్గాన్ని రౌడీ



రాజ్యాంగా మార్చాలని మంథని ప్రజలు గ్రహించి, రేండు పర్యాయాలు శ్రీదర్ బాబును గెలిపించారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు తెచ్చారని, ముఖ్యంగా అందరికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ధ్యేయంగా ముందుకు వెళుతుంటే ఇది గమనించక పుట్ట మధు చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా మధు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు. ప్రజా సేవ చేస్తున్న దుద్దిళ్ల కుటుంబంపై అసత్యపు వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు కిషన్ నాయక్ పాల్గొన్నారు.

# కెమికల్ కంపెనీలో ప్రమాదం ఆరుగురికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం వద్ద గల శ్రీజయ కెమికల్ కంపెనీలో ప్రమాదం జరిగింది. గ్యాస్ లీకై ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో గుట్టుచప్పుడు కాకుండా బాధితులను యాజమాన్యం ఆస్పత్రికి తరలించింది. విషయం బయటకు పొక్కకుండా బాధితులతో రాజీ కుదుర్చుకుంటున్నారని సమాచారం. చికిత్స పొందుతున్న కార్మికులు నాగబాబు,నారా గోపి, లలిత్, చిన్నబాబు, శ్రీనివాసరావు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వకుండా బాధితుల తరపు బంధువులను ఆపుతున్నారు. కంపెనీలో ఎలాంటి సేఫ్టీ మెజర్మెంట్స్ పాటించకపోవడంతో ఈ కంపెనీలో పదే పదే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కంపెనీలో గత నాలుగు నెలల క్రితం కూడా ఇలాగే ప్రమాదం చోటుచేసుకుని ఒక కార్మికుడు చనిపోయాడు. శ్రీ జయ కంపెనీ వల్ల చుట్టుపక్క గ్రామాల ప్రజలు, రైతులు చాలా నష్టపోతున్నారు.పలుమార్లు పీసీబి వారికీ ఫిర్యాదులు అందచేసినా నామమాత్రపు తనిఖీలు చేసి వెళ్తారు. ఈ మధ్యనే ఈ కంపెనీకి పి సీ బీ నుండి కూడా నోటీసులు అందాయి.

# పోస్టుల భర్తీకి సయోధ్య బ్రేక్...

నల్గొండ, తెలంగాణ కాంగ్రెస్‌లో సయోధ్య లేకే పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం కసరత్తు కొలిక్కి రావడం లేదని గాంధీభవన్ టాక్. మరీ ముఖ్యంగా నల్లగొండ జిల్లాకు చెందిన నేతల వ్యవహారం కారణంగానే పదవుల భర్తీ ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పడిందని చర్చ జరుగుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నేతలు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు? వారు పెడుతున్న కండీషన్లతో మొత్తం ప్రక్రియను పెండింగ్ పెట్టాలని హైకమాండ్ నిర్ణయించిందట.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో కొనసాగుతున్నారు. తాజా మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు కల్పించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గట్టిగా పట్టుబడుతున్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వస్తే మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తామని అధిష్టానం పెద్దలు తనకు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ? తనకు ఎట్టిపరిస్థితుల్లోనూ మంత్రి వర్గంలో చోటివ్వాలని డిమాండ్ చేస్తున్నారట రాజగోపాల్‌రెడ్డి. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా భువనగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకొస్తే కచ్చితంగా మంత్రిపదవి ఇస్తామని మరోసారి హామీ ఇచ్చారని తనకు మంత్రి పదవి ఇచ్చి అన్న మాట నిలబెట్టుకోవాల్సిం దేనని పట్టుబడుతున్నారట రాజగోపాల్‌రెడ్డి. పార్టీ పెద్దల ఆదేశాల మేరకు భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి బాధ్యతలు తీసుకొని భారీ మెజారిటీతో గెలిపించానని గుర్తు చేస్తూ అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు రాజగోపాల్‌రెడ్డి. తామిచ్చిన మాట ప్రకారం రాజగోపాల్‌రెడ్డిని క్యాబినెట్‌లోకి తీసుకోడానికి అధిష్టానం కూడా సిద్ధమైందని సమాచారం. ఐతే ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైందంటున్నారు. సీనియర్ నేత, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రంగంలోకి దిగి.. రాజగోపాల్‌రెడ్డికి మంత్రిగా అవకాశమిస్తే? తన భార్యకు క్యాబినెట్‌లో బెర్త్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట? కోమటిరెడ్డి ఫ్యామిలీలో ఇప్పటికే వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉన్నారని.. రాజగోపాల్ రెడ్డి తన అవసరానికి బీజేపీలోకి వెళ్లి.. తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట..జిల్లాలో కోమటిరెడ్డి కుటుంబానికే రెండు మంత్రి పదవులిస్తే.. పార్టీకి లాయలిస్ట్‌గా పనిచేసిన తమ కుటుం బం సంగతి ఏంటని ప్రశ్నిస్తున్నారు ఉత్తమ్? ఏడేళ్ల పాటు పీసీసీ చీఫ్‌గా పనిచేసిన తాను పార్టీ అప్పగించిన ప్రతిపనినీ తూ.చ. తప్పకుండా నెరవేర్చానని గుర్తుచేస్తున్నారట ఉత్తమ్. అంతేకాకుండా నల్లగొండ పార్లమెంట్ బాధ్యత తీసుకొని రికార్డు మెజారిటీతో గెలిపించామని చెబుతున్నారు ఉత్తమ్. మంత్రివర్గంలో జిల్లాకు ఛాన్స్ ఇస్తే.. తన భార్య కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు గాంధీభవన్ సమాచారం. మంత్రి ఉత్తమ్ కండిషన్‌తో హైకమాండ్ డైలమాలో పడిపోయిందని అంటున్నారు. ఇలా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తమ ప్రయత్నాలు చేస్తుండగా, ఉమ్మడి నల్గొండకే చెందిన మరో ఎమ్మెల్యే కూడా మంత్రి పదవి ఆశిస్తూ మంత్రాంగం నడుపుతుం డటం కాంగ్రెస్‌లో కాకరేపు తోంది. మంత్రి వర్గంలో లంబాడ సామాజిక వర్గానికి అవకాశం కల్పించా లని డిమాండ్ చేస్తూ.. దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ మంత్రివర్గ రేసులోకి వస్తున్నారు. ఇప్పుడు ఉన్నవే ఆరు బెర్తులు.. వీటిని సామాజిక సమీకరణాల ఆధారంగా ఫుల్ ఫిల్ చేయాల్సి ఉంటుందని ఆరులో మూడు బెర్తులు ఒకే జిల్లా వారు అడుగుతుం డటంతో ఏం చేయాలో తేల్చుకోలేని కాంగ్రెస్ అధిష్టానం పీసీసీతో పాటు మంత్రి పదవుల భర్తీని పెండింగ్‌లో పెట్టిందంటున్నారు. నేతలు పదవుల కోసం పోటాపోటీగా ఒత్తిడి తెస్తుండటంతో ఏం చేయాలో అర్థం కాక పార్టీ హైకమాండ్ తల పట్టుకుంటోందంటున్నారు.

# నిధుల కోసం భూములు తాకట్టా...

## అలా చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయి.?
## మన యువతకు ఉద్యోగాలు ఎలా

హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సరార్, ఇప్పుడు నిధుల సమీకరణ కోసం ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు, దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రూ.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైనట్టు మీడియాలో వస్తున్న కథనాలను కోట్ చేస్తూ ఆయన బుధవారం ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటిచోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని విమర్శించారు. రాష్ట్రంలో ఏడు నెలలుగా పారిశ్రామికరంగం స్తబ్దుగా మారిందని, కొత్తగా పెట్టుబడులు రావడం లేదని, ఉన్న కంపెనీలు కూడా ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూములను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెడితే కంపెనీలు ఎలా వస్తాయని, కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు.

**చిట్టెలుకలు, బల్లి పడిన టిఫిన్లు.**

పురుగుల అన్నం. నీళ్ల చారు. బల్లిపడిన టిఫిన్లు. చిట్టెలుకలు తిరిగే చట్నీలు' అని రాష్ట్రంలో హాస్టళ్ల దుస్థితిపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లు దయనీయంగా మారాయని ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలంటే మొత్తానికి కాంగ్రెసోళ్లు వచ్చి పెద్ద మార్పే తెచ్చారు' అని ఎద్దేవా చేశారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషితాహారం తిన్న విద్యార్థి విషాదాంతం, నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులకు వాంతులు, సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థుల బెంబేలు' అని సర్కారు హాస్టళ్ల తీరుపై విమర్శలు గుప్పించారు.

విషాహారం పెడితే విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరు? తల్లిదండ్రులకు భరోసా ఏది? అని ప్రశ్నించారు. హాస్టళ్లల్లో కలుషితాహారం వల్ల పిల్లలు దవాఖానల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సర్కారు అస్తవ్యస్త విధానాలే ఇందుకు కారణమని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరచి భావి పౌరుల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని సూచించారు.

# మూడు ఎడిషన్లలో క్రెడాయబిలిటీ లక్ష్యం 'హౌస్ ఫర్ ఆల్'

- ఆగస్టు 2 నుంచి 4 వరకు హైటెక్స్‌లో
- 9 నుంచి 11 వరకు కొంపల్లిలో..
- 23 నుంచి 15 వరకు నాగోల్‌లో
- కొనుగోలుదారులు, బిల్డర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం

హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడారు) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'క్రెడాయబిలిటీ' పేరుతో మూడు ఎడిషన్లలో ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో క్రెడారు హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు వీ రాజశేఖరరెడ్డి, ప్రెసిడెంట్-ఎలక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ జగన్నాధరావు మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి మూడు దిక్కులా మూడు ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పురోగమనంలో ఉన్నదనీ, దాన్ని మరింత వృద్ధిచేసేందుకు ఈ షోలు ఉపయోగపడతాయని తెలిపారు. ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తొలి ప్రదర్శన ఉంటుందనీ, దీన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్స్‌లో నిర్వహించే ప్రాపర్టీ షోను ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు, ఆగస్టు 23 నుంచి 25 వరకు ల్యాండ్ నాగోల్ మెట్రో స్టేషన్‌లో జరిగే ప్రదర్శనను రెవెన్యూ శాఖ మంత్రి పీ శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని వివరించారు. ఈ ప్రదర్శనల ఏర్పాటు ద్వారా కొనుగోలుదారులు, బిల్డర్ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం 'క్రెడారు' ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.




ఈ ప్రాపర్టీ షోల్లో రూ.35 లక్షల నుంచి ఇండ్ల నమూనాలు ప్రారంభమవుతాయన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో, నాణ్యమైన సౌకర్యాల కల్పనతో, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అనుమతులతో కూడిన వెంచర్లు ఇక్కడ ప్రదర్శిస్తారని చెప్పారు. ఎగ్జిబిషన్లలో ఇప్పటికే 10 శాతం స్టాల్స్ బుకింగ్స్ పూర్తయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగితే మంచిదేననీ, కానీ అది హైదరాబాద్‌తో పోటీ పడలేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి విలువలు పెంచే ప్రయత్నం చేస్తున్నదనీ, అది అవసరమే అయినా, దానిపై శాస్త్రీయ అధ్యయనం చేసి, కొద్ది రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

క్రెడారు ప్రాపర్టీ షోల్లో ఎక్కడా ప్రీ లాంచింగ్ వెంచర్లు ఉండబోవన్నారు. పూర్తి పారదర్శకంగా ఇండ్లు, ఇండ్ల స్థలాల అమ్మకాలు జరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ చాప్టర్ పరిధిలో 35 లక్షల యూనిట్లు అందుబాటులో ఉన్నాయనీ, కొన్ని సర్వే సంస్థలు పేర్కొన్నట్టు తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏమాత్రం వెనుకబడి లేదని స్పష్టం చేశారు. హౌస్ ఫర్ ఆల్ సేవతో కూడిన కాన్సెప్ట్‌తో 'క్రెడారు' పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో క్రెడారు ఉపాధ్యక్షులు ఎమ్ శ్రీకాంత్, బీ ప్రదీప్‌రెడ్డి, సీజీ మురళీమోహన్, జాయింట్ సెక్రటరీ గూడూరు నితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## -మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్ రెడ్డి

మంథని : సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్ రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మ వాడలో చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ కొట్టె పద్మ రమేష్ తో కలిసి 8వార్డు లో డ్రైడే-ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పెంద్రి రమా సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లలో నిల్వ నీటిని ఉంచుకోవద్దని వాటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. అలాగే వార్డు లోని పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలని వార్డ్ ఆఫీసర్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కొట్టె రమేష్, మున్సిపాల్ సిబ్బంది ఆశ వర్కర్స్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీరామ్ పతి కాలువ పైప్ లైన్లు వెంటనే మార్చాలి

## – తుమ్మల వెంకటరెడ్డి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు



గోవిందరావుపేట: శ్రీ రామ్ పతీ కాలువ పైపులైన్లను వెంటనే మార్చాలనీ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలం లోని శ్రీరామ్ పతి కాలువ పిచ్చయ్య పైప్ లైన్ ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. ఈ తూము కింద సుమారు 120 ఎకరాల కు నిరందించాలి .ఇది రాంపూర్ కాల్వ మీద పైప్లైన్ ద్వారా నీరు రావాలి .గత 30 ఏళ్ల కింద వేసిన పైప్ లైన్ ఇది శిథిలావస్థకు చేరింది ఈ పైప్ లైన్ ద్వారా ఈ ఖరీఫ్ సీజన్లో నీరు వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం కాలువలకు కోటి రూపాయలు పండు ద్వారా చెరువు కింద పనులు కాంట్రాక్టర్లు చేస్తున్నారు.

ఈ పని కూడా ఈ కోటి రూపాయల్లో ఉన్నది కాంట్రాక్టర్ ఫోన్ చేస్తే వరుస పెట్టి చేసుకుంటూ వస్తున్నాను అది కూడా చేస్తాను అని పేర్కొన్నాడు. కానీ ఇప్పటికే శ్రీరామ్ పతి కాలువ కింద ఈదుల మత్తడి సగం పనులు చేసి నిలిపివేసినాడు .ఇక్కడ పైపులైను మొదలుపెట్టలేదు. కావున తక్షణమే అధికారులు పైప్ లైన్ వేసే విధంగా చర్య తీసుకోవాలని లేనియెడల కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్టులో పెట్టి డిపార్ట్మెంటే ఈ పైప్ లైన్ ని పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున రైతుల సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు బాదావత్ లక్ష్మణ్ నాయక్ బాధావత్ బాలు దారావత్ రాకేష్ మట్ట వెంకట పాపిరెడ్డి ఏనుగు యాదిరెడ్డి బొప్పూడి పూర్ణచందర్ వేములవాడ%న% రామారావు పోతరాజు యాదయ్య వేములవాడ వెంకటేశ్వరరావు అంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుంచాల తిరుపతిరెడ్డి కొత్త సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి: తహసీల్దార్ రవీందర్

## – జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో అవగాహన

తాడ్వాయి : వరదలతో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని స్థానిక తహసిల్దార్ తోట రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఊరట్టం, ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లో విద్యార్థులతో గ్రామస్తులతో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ తోట రవీందర్, ఎన్ డీ ఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్ భూపాల్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి లు మాట్లాడుతూ వరదలు, భూకంపం, రోడ్డు ప్రమాదాలు, ఆకస్మిక గుండెపోటు తదితర ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, వాలంటీర్లకు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. విపత్తులు సంభవించినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు.




ఆదర్శప్రాయమైన ధైర్య సాహసాలు, నిబద్ధతతో కూడిన వృత్తి నైపుణ్యాలతో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆపదలో ఉన్న వారిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఊరట్టం పాఠశాల హెచ్ఎం ఈసం రమేష్, ఎన్ డి ఆర్ ఎఫ్ టీం సభ్యులు హెచ్ రవి కుమార్, గ్రామ పెద్దలు, వాలంటీర్లు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ 14 ఎందుకు మిస్సైంది

హైదరాబాద్, లోక్ సభ ఎన్నికలు ముగిశాయి.. ఎన్డీఏ అధికారాన్ని చేపట్టింది.. గతంతో పోలిస్తే ఇప్పుడు విపక్ష పార్టీలు సైతం బలాన్ని పెంచుకున్నాయి.. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఫలితాలపై పోస్టుమార్టం మొదలుపెట్టింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఆశించిన మేర ఫలితాలు సాధించకపోవడానికి కారణాలపై ఆరా తీసేందుకు ౦ఎఅఅ నియమించిన జేపీ కురియన్ నేతృత్వంలోని నిజ నిర్ధారణ త్రిసభ్య కమిటీ హైదరాబాద్ చేరుకుంది. కమిటీ సభ్యులకు పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ స్వాగతం పలికారు. కురియన్‌తో పాటు రకీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు గాంధీభవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో వరుసగా భేటీ అవుతారు. రియన్ కమిటీ ముందు తమ ఓటమికి కారణాలు చెప్పుకునేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధానంగా సొంత పార్టీ నేతల వల్లే ఓడిపోయామని ఎక్కువ మంది చెబుతున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్ నగర్ లోక్ సభ స్థానంలో అన్ని చోట్లా కాంగ్రెస్ గెలిచినప్పటికీ.. లోక్ సభ ఎన్నికల్లో అక్కడ బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చినప్పటికీ చివరిలో పరాజయం ఎదురైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో మంచి మెజార్టీ వచ్చినా ఇతర చోట్ల బీజేపీ అభ్యర్థికి ఓట్లు పడటంతో వంశీచందర్ రెడ్డి స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. అలాగే సికింద్రాబాద్ , నిజామాబాద్, ఆదిలాబాద్, చేవెళ్ల, మెదక్ వంటి చోట్ల గెలుపు అవకాశాలు ఉన్నా.. సద్వినియోగం చేసుకోలేకపోయారన్న దిశగా కురియన్ కమిటీ పరిశీలన జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. పార్టీ నేతలు తమకు ఎలా సహకరించలేదో చెబుతూ.. వారికి పట్టు ఉన్న పోలింగ్ బూత్‌లలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు.. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల వివరాలను కురియన్ కమిటీ ముందు పెడుతున్నట్లుగా చెబుతున్నారు. గాంధీ భవన్‌లో కురియన్ కమిటీతో భేటీ అయ్యేందుకు కొంత మంది గెలిచిన అభ్యర్థులతో పాటు మరికొంత మంది టిక్కెట్ ఆశించి భంగపడినవారు కూడా వచ్చారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలు జరిపి నివేదికను హైకమాండ్ ను కురియన్ కమిటీ సమర్పించనుంది. అయితే ఇది.. ఎవరిపైనా ఫిర్యాదులు చేయడానికి లేదా ఫలనా వాళ్ల తప్పు ఉందని చెప్పడానికి కాదని.. కేవలం పార్టీ వైపు నుంచి ఏమైనా తప్పులు జరిగిదే దిద్దుకోవడానికి హైకమాండ్ చేస్తున్న ప్రయత్నమేనంటున్నారు. ఇలాంటి కమిటీలు ఒక్క తెలంగాణ కే వేయలేదని.. మరో ఐదారు రాష్ట్రాలకు? వేశారని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ గెలుస్తుందనుకున్న లోక్‌సభ స్థానాల్లో ఓటమికి కారణాలపై వారిని కమిటీ సభ్యులు ఆరా తీస్తారు. రెండో రోజు పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అవుతారు. లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలకు క్షేత్రస్థాయిలో నేతల పనితీరు, అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా ఓటమికి కారణాలను అడిగి తెలుసుకుంటారు. మూడో రోజు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలకు కమిటీ సభ్యులు వెళతారా..? లేదా..? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రధానంగా చేవెళ్ల, మల్కాజిగిరి, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, సికింద్రాబాద్ వంటి స్థానాల్లో పార్టీ ఓటమికి దారితీసిన పరిస్థితులేమిటనే కోణంలో అధిష్ఠానం ఆరా తీస్తోంది. ఈ లోక్‌సభ స్థానాల పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నెగ్గినా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై కమిటీ విశ్లేషణ జరుపుతుందని సమాచారం. ఆయా స్థానాల నేతలు తగు సమాచారంతో హాజరుకావాలని ఇప్పటికే వారికి పార్టీ సూచించింది. కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో స్థానిక నేతలు సరిగా పనిచేయలేదనే ఆరోపణలు సైతం ఉండటంతో వారి గురించి వివరాలు సేకరించనుంది.

# యథేచ్ఛగా అటవీ భూములు ఆక్రమణ

- పోడు భూములపట్టాతో అడవులను దున్నేస్తున్న ఆక్రమణదారులు
- కబ్జాలకు పాల్పడుతున్న వైనం
- మండలంలోని శివారుల్లో దాదాపు వందల ఎకరాలకు పైగా అటవీ భూమి కబ్జాకు యత్నం
- అడవిలో చెట్లను నరికేసిన కబ్జాదారులు
- ఫారెస్ట్ అధికారులు దాడులు చేస్తున్నా ఆగని ఆక్రమణలు
- మండలంలో కనుమరుగవుతున్న అడవులు

పెద్దకొడప్ గల్: పెద్దకొడప్ గల్ మండలంలోని అటవీ భూములు దున్నుతున్న జెసిబి ట్రాక్టర్లు ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారి సంజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దకొడప్ గల్ మండలంలోని పలు గ్రామాల్లో అధిక డబ్బులు తీసుకొని ట్రాక్టర్ జెసిబి లతో ఫారెస్ట్ భూములు దున్నుతున్నారని స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకోగా సంఘటనా స్థలంలో ఒక జెసిబి ఒక ట్రాక్టర్ దున్నుతున్న సమయంలో దొరికాయని అటవీ భూమి అయిన 464 సర్వే నెంబర్లు దున్నకాలు జరగడంతో సమాచారం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అటవీ భూముల ఆక్రమణదారులు, స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు కనుమరుగవుతున్నాయి. భవిష్యత్తు తరాలకు అడవులను మిగిల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. పంటల సాగు పేరిట ప్రకృతి సంపదైన అటవీ భూములను కొల్లగొడుతున్నారు. దీంతో జిల్లాలో రోజురోజుకూ అడవులు కనుమరుగవుతన్నాయి. ప్రస్తుతం 22 శాతం మాత్రమే అడవులు ఉన్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా అటవీశాఖ దాడులు చేస్తున్నా ఆక్రమణకు గురవుతునే ఉన్నాయి. మండలంలో ఇప్పటి వరకు వందల ఎకరాలకు పైగా అటవీ భూములు కబ్జాలు అయినట్లు ఆ శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఆక్రమణ దారులు అటవీ భూములపై పడినట్లు తెలుస్తోంది. ఇదే అదనుగా భావించి అటవీ భూములను ఆక్రమించుకునేందుకు ఆక్రమణదారులు ప్రయత్నాలు చేపడుతుండడం మండలంలో జరుగుతున్న సంఘటనలే నిదర్శనం.

# మార్క్ చూపించేసిన జితేందర్

హైదరాబాద్, తెలంగాణ కొత్త పోలీస్ బాస్‌గా జితేందర్ నియమితుల య్యారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన అనూహ్యంగా తెరపైకి వచ్చారు. సీనియారిటీ జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న జితేందర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కొత్త పోలీస్‌బాస్‌గా నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వెంటనే సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆయన బాధ్యలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి అనుమతి ఇవ్వడంతోనే ఉత్తర్వుల జారీ, బాధ్యతల స్వీకరణ చకచకా జరిగాయి. ఇక కొత్త డీజీపీగా బాధ్యతలు చేపట్టిన జితేందర్ వెంటనే తన మార్కు పాలన మొదలు పెట్టేవారు. తనకు అవసరమైన టీంను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలో ఒకరు ఇద్దరు కాదు ఏకంగా 15 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ చేసిన వారిలో కొందరికి కీలక బాధ్యతలు అప్పగించారు గతంలో రాచకొండ కమిషనర్‌గా పని చేసిన మహేష్ భగవత్‌ను శాంతిభద్రతల అదనపు డీజీపీగా బదిలీ చేశారు. ఇక వరంగల్ సీపీగా బాధ్యతలు నిర్వహించిన సుధీర్ బాబును రాచకొండ సీపీగా పదోన్నతి కల్పించారు. తెలంగాణలోపాలనపై దృష్టిపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఈమేరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవలే ఐఏఎస్ లను బదిలీ చేసిన సీఎం ఇప్పుడు ఐపీఎస్‌లపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే ఏకంగా పోలీస్‌బాస్‌నే మార్చేశారు. తర్వాత కొత్త పోలీస్ బాస్‌తో 15 మంది ఐపీఎస్‌లను బదిలీ చేయించారు. హోంగార్డులు, ఆర్గనైజేషన్ అదనపుగా డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా విజయ్‌కుమార్‌ను నియమించారు. ఇక కొత్త డీజీపీ జితేందర్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటినుంచి సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్ బాస్ మార్పుపై కసరత్తు చేశారు. ఈ క్రమంలో కొందరు సీనియర్ల పేర్లు పరిశీలించారు. అవకాశం మాత్రం అనూహ్యంగా 1992 బ్యాచ్ ఐపీఎస్ జితేందర్‌కు కల్పించారు. డీజీపీ, సీనియర్ ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ డిసెంబర్ 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడుతున్న సమయంలో రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఎన్నికల సంఘం అతడిని సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో రవిగుప్తాను డీజీపీగా నియమించింది. తాజాగా జింతేదర్‌ను సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిననాటి నుంచి పోలీస్ అధికారుల బదిలీలు జరుగుతూనే ఉన్నాయి. అయితే డీజీపీని మాత్రం సీఎం ఇంతకాలం మార్చలేదు. డీజీపీగా నియమించాలంటే సీనియారిటీ, సమర్థత ముఖ్యం. సీనియారిటీ జాబితాలో 1990 బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా ఉన్నాడు. తర్వాత స్థానంలో 1991 బ్యాచ్‌కు చెందిన రాజీవ్‌రతన్ ఉండగా ఆయన ఇటీవలే మరణించారు. ఇక మూడో స్థానంలో 1991 బ్యాచ్‌కే చెందిన సీవీ.ఆనంద్ ఉన్నారు. నాలుగో స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన జితేందర్ ఉన్నారు. రాజీవ్ రతన్ తర్వాత ఈయన మూడో స్థానానికి వచ్చారు. రవి గుప్తా తర్వాత సీవీ ఆనంద్‌కు డీజీపీ పదవి రావాలి. కానీ ఆయన గొర్రెల స్కాంతోపాటు పలు కేసుల విచారణలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా జితేందర్ డీజీపీ అయ్యారు. అనుభవం, సమర్థత, వివాద రహితుడు కావడంతోనే సీఎం జితేందర్‌వైపు మొగ్గు చూపారు. ఇదిలా ఉండే డీజీపీ నియామకం కోసం 1993 బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి పేరును కూడా రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అయితే ఆయన ప్రస్తుతం అదనపు డీజీపీ హోదాలో ఉన్నారు. డీజీపీ హోదాలో ఉన్న రాజీవ్ రత్ కన్నుమూయడం, సందీప్ శాండిల్య పదవీ విరమణ చేయడంతో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. అదనపు డీజీల సీని యారిటీ జాబితాలో ఉన్న కొత్తకోట శ్రీనివాస్రెడ్డి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్నారు. ఈయనతోపాటు శివధర్‌రెడ్డికి డీజీపీగా పదోన్నతి రావాల్సి ఉంది. ప్రక్రియ పూర్తి కాకపోవడంతో లైన్ క్లియర్ కాలేదు.

# టీబీజేపీ కొత్త బాస్ ఎవరు

హైదరాబాద్, ఈ నెలఖరుకే కొత్త సారథికి పగ్గాలు అప్పగించే ఛాన్స్ కనిపిస్తోంది. అందరికంటే ముందు రేసులో ఈటల రాజేందర్ ఉన్నా.. ఆయనకు రఘునందన్, ధర్మపురి అర్వింద్ నుంచి గట్టి పోటీయే ఉంది. ఈ ముగ్గురిలో ఒకరికి ఛాన్స్ దక్కుతుందని ప్రచారం జరుగుతున్న టైమ్‌లో.. ఎవరికివారు తమ బలాబలాలను హైకమాండ్ ముందు ఉంచుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో బీజేపీ తన ఉనికిని క్రమంగా విస్తరిస్తూ వచ్చింది. ఎన్నికలు ఏవైనా కమల వికాసం ఖాయం అనేలా తన కేడర్ ను బలపరుచుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్రానికి ఒక బలమైన దిశానిర్దేశం చేసే నాయకుడు ఉండాలని భావిస్తోంది. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి నియామకం ఆలస్యమవుతుండడంతో.. పలు రాష్ట్రాల్లో అధ్యక్షుల మార్పుపై హైకమాండ్ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. హర్యానా ఎన్నికల నేపథ్యంలో ముందుగా అక్కడ బీజేపీ చీఫ్‌ను ప్రకటించారు. ఆ రాష్ట్ర అధ్యక్షుడిగా మోహన్‌లాల్ బడోలీకి బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లోనూ అధ్యక్ష మార్పులు ఉంటాయని తెలుస్తోంది. కిషన్‌రెడ్డి కేంద్ర కేబినెట్‌లో ఉన్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా అధ్యక్ష బాధ్యతల్ని మరొకరికి అప్పగించేలా కసరత్తు జరుగుతోంది. గతంలో బండి సంజయ్ కు ఇచ్చిన తరుణంలో తిరిగి ఆయనకే ఆధ్యక్షుడి పగ్గాలు అప్పగిస్తారన్న చర్చ ఓ వర్గంలో జరుగుతోంది. అయితే ఆయనకు కూడా రాష్ట్ర అధ్యక్షునిగా పదవి దక్కే అవకాశాలు కనపించడం లేదు. దీనికి కారణం ఆయనను కూడా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పదవి వరించడమే. దీంతో ఇక మిగిలింది ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్. ఈ ముగ్గురిలో ఈటలకు అవకాశాలు అధికంగా ఉండటానికి కారణం రాష్ట్రంలో సీనియర్ నేత, బీఆర్ఎస్ లో ఉండి అక్కడి పరిస్థితులు కేసీఆర్ వ్యూహాలు బాగా తెలిసిన వ్యక్తి కావడంతో ఆయనకే రాష్ట్ర అధ్యక్షుడి పదవి దక్కుతుందని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా మరో 20 రోజుల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కొత్త రథసారధి ఎవరనే ఉత్కంఠకు తెర తొలగనుంది.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులలో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**



జయశంకర్ భూపాలపల్లి: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచి రైతులకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో చిన్న కాళేశ్వరం పనుల పురోగతిపై ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ, మేఘ కంపనీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూచిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులలో వేగం పెంచాలని వీరపూర్ చెరువు, మందిరం చెరువు ఆయకట్టు సర్వే పనులను ఆదివారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. బీర సాగర్ పంపు హౌస్ లో పంపుల మరమ్మత్తులకు కావలసిన పరికరాలను తెప్పించి పనులు పూర్తి చేసి జూలై మాసం చివరి కల్ల నీటిని ఎత్తి పోయు విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంప్ హౌస్ ముంపునకు గురికాకుండా చేపట్టిన రక్షణ చర్యల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి నుండి అప్రోచ్ కెనాల్ ద్వారా నీరు రావడానికి ఇసుక తొలగింపునకు మైనింగ్ అధికారులను ఆదేశించడం జరిగిందని, బీర సాగర్ పంప్ హౌస్ వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి అయ్యాయని , గారేపల్లి పంప్ హౌస్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ కు కావలసిన ట్రాన్స్ఫార్మర్స్, మెటీరియల్ తెప్పించి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. రెండు పంప్ హౌస్ ల అప్రోచ్ కెనాళ్ళు, ప్రధాన కాల్వలు పూర్తిచేయాలని తెలిపారు. మల్హర్ మండలం రుద్రారం చెరువు కట్ట పనులు, గారేపల్లి పంప్ హౌస్ నుంచి ఆదివారం పేటచెరువు వరకు పైపులైను నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఈ సీజన్ లో మొదటి విడత పనులు పూర్తి చేసి పంటలకు నీరందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్.ఈ మల్చూర్, ఆర్డీవో మంగిలాల్, ఇరిగేషన్ ఈ ఈ యాదగిరి, మహ దేవపూర్, కాటారం తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ నేతల్లో మౌనం...

హైదరాబాద్, పదేళ్ల అధికారం తర్వాత ప్రతిపక్షంలో కూర్చున్న భారత రాష్ట్ర సమితికి ఫిరాయింపుల భయం పట్టుకుంది. ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేలు చేజారిపోతున్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. త్వరలో లెజిస్లేటివ్ పార్టీని విలీనం చేసుకుంటామంటూ కాంగ్రెస్ సవాల్ చేస్తోంది. ఇంకోవైపు పార్టీ అధినేత కేసీఆర్ చుట్టూ కేసుల ఉచ్చు బిగిసుకుంటోంది. మరోవైపు ఎమ్మెల్సీ కవిత ఇంకా బెయిల్ రాక జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి. రాష్ట్రంలో కేంద్రంలో అధికారంలో ఉన్న రెండు పార్టీలకు బీఆర్ఎస్ ప్రత్యర్థిగా ఉంది. దీంతో ఈ రానున్న రోజులు మరింత పార్టీకి గడ్డుకాలంగా కనిపిస్తుందని పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. ఇన్ని పరిణామాల మధ్య పార్టీ కీలక నేతలు కేటీ రామారావు, హరీష్ రావు వారం రోజుల పాటు ఢిల్లీలోనే మకాం వేశారు. కవిత మెయిల్ కోసం న్యాయవాదులతో చర్చలు అంటూ బయటకు చెప్తున్నా, అసలు కారణం వేరే ఉందని పార్టీలో తీవ్రంగా చర్చ జరుగుతుంది. బీజేపీతో పొత్తు వైపుగా బీఆర్ఎస్ వెళు తుందని మరో వైపు బయట ప్రచారం జరుగుతుంది. అసలు ఢిల్లీలో ఆ ఇద్దరు నేతలు ఎవరిని కలిశారు ఎవరితో సంప్రదింపులు జరిపారు అన్నదీ సస్పెన్స్ గానే మిగిలింది. అటు ఢిల్లీ నుంచి రాగానే ఆ ఇద్దరు నేతలు వరుసగా రెండు రోజుల నుంచి ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఆర్ తో భేటీ అయ్యారు. రోజంతా ఢిల్లీ పరిణమాలపై చర్చలు జరుపారు. తాజా రాజకీయ పరిణామాలను బట్టి చూస్తే, ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న సవాలు రెండు. ఒకటి పార్టీని కాపాడుకోవడం, పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం. రెండు కేసుల నుంచి బయటపడడం, కొత్తగా రాబోయే కేసులను ఎదుర్కోవడం. ఈ రెండు అంశాలపైనే రెండు రోజులుగా తీవ్రమైన చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తును కాపాడుకుని, ఎమ్మెల్యేలు చేజారుతున్న కిందిస్థాయి క్యాడర్‌ను కాపాడుకోవాలని ఆలోచన. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు తీవ్రతరం చేయాలి. కలిసి వచ్చే పార్టీలు సంఘాలతో ఒక వేదిక క్రియేట్ చేయాలనేది మరో ఆలోచనగా కనిపిస్తోంది. వీటన్నిటితోపాటు ప్రభుత్వం వేసిన రెండు కమిషన్లతోపాటు రాబోయే రోజుల్లో మరిన్ని అంశాలపై ఇంకొన్ని కేసులు బీఆర్ఎస్‌కు ఛాలెంజ్‌గా మారనున్నాయి. వాటిని కూడా సమర్థవంతంగా ఎదుర్కొని అవినీతి మరకలు పార్టీకి అంటకుండా చూసుకోవడం ఇప్పుడున్న పెద్ద సవాల్.

ఈ రెండు అంశాలపైన త్వరలో అత్యంత కీలక నిర్ణయాలు ఉంటాయని పార్టీలో అంతా భావిస్తున్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితిగా మారిన తర్వాతే డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని కార్యకర్తల అభిప్రాయం. పార్టీకి సంబంధించిన సీనియర్ లీడర్ వినోద్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. టెక్నికల్ గా పార్టీ పేరును ఇప్పటికిప్పుడు మార్చే అవకాశం లేకున్నా, ఇందుకోసం ఓ ప్రత్యామ్నాయ ఆలోచన చేయాలని కూడా గులాబీ అధిష్టానం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

# విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

**విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి**

**పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పాఠశాల ఆవరణలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్ర చేయాలి**

**డిజిటల్ బోధన తరగతులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకుఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూవిద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేసి విద్యార్థులకు సకల సదుపాయాలు అందించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో చింత, ఉసిరి, వెలగ, కరివేపాకు, మునగ వంటి మొక్కలు నాటించాలన్నారు. 9వ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థి యూనిఫామ్ ధరించకపోవడంతో యూనిఫామ్ ఎందుకు వేసుకోలేదని కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు తన పుట్టినరోజని శివాజీ అనే విద్యార్థి తెలుపగా విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ టివిని పరిశీలించారు. డిజిటల్ టివి ద్వారా విద్యార్థులు పాఠాలు వినేందుకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని 10 పాఠశాలలో హెచ్ డి ఎఫ్ సి సి ఎస్ ఆర్ నిధులతో 10 టివిలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి ద్వారా విద్యాబోధన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో మరమ్మతు పనులను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభించి మూడు నెలలైనా ఎందుకు పూర్తి చేయలేకపోయారని, తక్షణమే పూర్తి చేయువిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని, ఈ వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందించాలని ఆయన సూచించారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, మున్సిపల్ చట్టం ప్రకారం పరిశుభ్ర చేపించు బాధ్యత మున్సిపాలిటీదేనని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ఆవరణలో వ్యర్ధాలను, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్ర చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ లో లాఫ్ రూల్...

టోక్యో, రోజులో మీరు ఎంత సేపు నవ్వుతారు..? అసలు నవ్వుతారా..? ఈ ప్రశ్నలు చాలా సిల్లీగా అనిపిస్తుండొచ్చు. కానీ మనకున్న రకరకాల ఒత్తిళ్ల నుంచి పైసా ఖర్చు లేకుండా బయటపడే మార్గం నవ్వడం మాత్రమే. అందుకే లాఫింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయండి అంటూ చాలా మంది ఎక్స్‌పర్ట్స్ సలహాలు ఇస్తున్నారు. బలవంతంగా అయినా కాసేపు నవ్వుకోండి అని చెబుతున్నారు. జపాన్ ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేసింది. "చచ్చినట్టు నవ్వాల్సిందే" అని కొత్త రూల్ తీసుకొచ్చింది. ఆ దేశంలో ఇప్పుడదో చట్టం కూడా అయిపోయింది. పౌరులంతా రోజుకి కనీసం ఒక్కసారైనా కచ్చితంగా నవ్వి తీరాల్సిందే. అలా చేస్తే గుండెపోటు ముప్పు తగ్గిపోతుందట. అందుకే ఇలా కండీషన్ పెట్టింది. నార్త్ జపాన్‌లో యమగర్తలో ఆర్డినెన్స్ కూడా పాస్ చేసింది ప్రభుత్వం. స్థానిక యూనివర్సిటీలో నవ్వుపై పరిశోధనలు చేసి, గుండెపోటు తగ్గిస్తుందని కన్‌ఫమ్ చేసుకున్నాకే ఈ ఆర్డినెన్స్ ఇచ్చారు అధికారులు. గత వారమే ఈ నిబంధన తీసుకొచ్చారు. నిజానికి ఐదేళ్ల క్రితమే ఓ హెల్త్ జర్నల్‌లో ఇందుకు సంబంధించిన ఓ ఆర్టికల్ పబ్లిష్ అయింది. "నవ్వుతో కలిగే ప్రయోజనాలు" అనే టాపిక్‌పై లోకల్‌గా యమగట యూనివర్సిటీలో రీసెర్చ్ జరిగింది. ఇంత రీసెర్చ్ జరిగిన తరవాతే రూల్ తీసుకొచ్చారు. రోజుకోసారి నవ్వడం ద్వారా మానసికంగా, శారీరకంగా కలిగే ప్రయోజనాలేంటో ప్రజలకు అర్థం అవుతుందనే ఉద్దేశంతోనే ఈ నిబంధన తీసుకొచ్చినట్టు ప్రభుత్వం వివరణ ఇస్తోంది. అటు వర్క్ ప్లేసెస్‌లోనూ ఈ రూల్‌ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు అందాయి. పని వాతావరణం ఎప్పుడూ సంతోషంగా ఉండాలని తేల్చిచెప్పారు. అంతే కాదు. ప్రతి నెల 8వ రోజుని "డే ఆఫ్ లాఫ్టర్"గా జరుపుకోనున్నారు. అయితే.. ఈ రూల్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మంచిదే అంటుంటే మరి కొందరు ఇదేం రూల్ అని మండి పడుతున్నారు. నవ్వాలా వద్దా అన్నది వ్యక్తిగత ఇష్టమని, రాజ్యాంగం కల్పించే హక్కుని కాదని బలవంతంగా నవ్వమంటారా అని ప్రశ్నిస్తున్నారు. నవ్వడం ఎంత ముఖ్యమైనప్పటికీ కొంత మంది లోలోపలే హ్యాపీగా ఫీల్ అవుతారని, అలాంటి వాళ్లూ నవ్వాలని ఒత్తిడి తీసుకురావడం సరికాదని వాదిస్తున్నారు. అంతే కాదు. ఆరోగ్య కారణాల వల్ల నవ్వలేని వాళ్లకి ఈ రూల్ నుంచి మినహాయింపు ఇవ్వాలనీ అంటున్నారు.

నవ్వడం ఎంత మంచిదే అయినా ఇలా బలవంతం చేసి నవ్వించడం వల్ల ఎలాంటి ఉపయోగముండదని తేల్చి చెబుతున్నారు. అంతకు ముందు రీసెర్చ్ కోసం 17 వేల మందిపై స్టడీ చేశారు. వాళ్లందరూ ఎప్పుడెప్పుడు ఎంత సేపు నవ్వుతారో అని అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్ల పాటు వాళ్ల హెల్త్ రికార్డ్‌ని ట్రాక్ చేశారు. వారంలో కనీసం ఓసారైనా నవ్విన వాళ్లలో గుండె సంబంధిత సమస్యలు చాలా అరుదుగా కనిపించాయి. నెలకోసారి నవ్వే వాళ్లలో కొన్ని సమస్యలు కనిపించాయి. ఈ రీసెర్చ్ ఆధారంగానే ప్రభుత్వం అక్కడ నిబంధన తీసుకొచ్చింది.

# భద్రాద్రిలో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం



భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతుంది. మూడు రోజుల క్రితం 4,లేదా 5 అడుగుల మేర ప్రవహించి స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం ఈరోజు ఉదయానికి 11.5 అడుగులు చేరి ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా నీటిమట్టం తక్కువగా ఉండి ప్రవహించిన గోదావరి ఎగువన కురుస్తున్న వర్షాలకు స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతంలో ఉన్న చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న ఛత్తీస్గఢ్ నుంచి వర్షపునీరు రావడంతో తాలిపేరు వద్ద అన్ని గేట్లను వదిలి దిగువన ఉన్న గోదావరి లోనికి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 11.5 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి మరో రెండు అడుగులు వరకు చేరవచ్చు అని సి డబ్ల్యూ సి అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు గోదావరి వరద ముంపు ప్రాంతాలను గుర్తించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎడారిని తలపించిన గోదావరి నేడు ఎగువ నుంచి వస్తున్న వరద నీటి వల్ల జలకళను సంతరించుకుంది.

# బడ్జెట్ పై సలహాలు ఇస్తారా.. ?

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో మోదీ భేటీ అయ్యారు. సమావేశానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సైతం హాజరయ్యారు. ఈ నెల 23న కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ సాధారణ బడ్జెట్‌లో పరిశ్రమలతో పాటు మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలపై భారీ ఆశలు పెట్టుకున్నారు. పెట్టుబడులను రాబట్టేందుకు కేంద్రం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలని భావిస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మోదీ 3.నా ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేయనుందని చెప్పారు. పెట్టుబడులు రాబట్టడం ద్వారా వృద్ధిరేటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం వ్యూహం సిద్ధం చేస్తోంది. అయితే, ఏ రంగంలో ఏ స్థాయిలో సంస్కరణలు అవసరమో ఆయా రంగాల నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. 2047 నాటికి మోదీ సర్కార్ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణ బడ్జెట్ ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశా నికి ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యేక కృషి అవసరమని భావించారు. ఆర్థికవేత్తలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు సైతం పేద, మధ్య దిగువ మధ్యతరగతి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను, గృహ రుణాల విషయంలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పేదల కోసం కొత్త పథకాన్ని ప్రారంభించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది.

# కార్మికుల సొమ్ము దర్జాగా దోపిడీ!

హైదరాబాద్: బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫర్ బోర్డు(బీఓసీడబ్ల్యూడబ్ల్యూ) యాక్ట్ 1996 ప్రకారం, ఏదైనా భవనం నిర్మాణంలో ఉంటే, ఒక శాతం సెస్‌ను వెల్ఫేర్ బోర్డుకు బదులాయించాలి. తెలంగాణలో ఏటా రూ.500 కోట్ల వరకు కార్మికుల కటుంబాలకు ఖర్చు పెట్టేందుకు ఆ ఆదాయం సమకూరుతుంటుంది. అయితే, ఇదే అదునుగా కార్మికుల సొమ్ముని దర్జాగా దోచేశారు. అందుకు రక్త పరీక్షల స్కీమ్ వెనుక జరిగిన స్కామ్ ఉదాహరణ. బయటకు అన్నీ పక్కాగా కనిపించినా, అనేక లొసుగులతో కొట్లాది రూపాయలు కొల్లగొట్టారు. డిజిటల్ ఇండియా స్కీమ్‌ని వాడుకుంటూ కొత్త పంథాలో స్కామ్‌కు తెరతీశారు. నవంబర్ 14, 2022. జీవో 20ని బీఓసీడబ్ల్యూడబ్ల్యూకి హెల్త్ స్క్రీనింగ్ స్కీమ్ అంటూ తీసుకొచ్చారు. పారదర్శకంగా ఉండేందుకు సెంట్రల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) ద్వారా పీపీపీ మోడల్‌లో ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సీజీహెచ్‌ఎస్ రేట్ల ప్రకారమే టెస్టులు చేయాలని రికమండేషన్ చేశారు. 22 టెస్టులకు గాను రూ.3,256 ఇవ్వాల్సిందిగా నిర్ణయించారు. ఈ రేటుతోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యం అందిస్తాయి. అయితే, తెలంగాణలో ఎలాంటి సెంటర్స్ లేకుండానే, అనుభవం లేని కంపెనీకి కేవలం కాంట్రాక్ట్ పద్దతిలో కట్టబెట్టడం వెనకాలే స్కామ్‌కి తెరలేపారు. పథకాలపై అవగాహన లేకుండా ఉండే కార్మికులని టార్గెట్ చేసుకుని స్కీమ్ అమల్లో స్కామ్ చేశారు. డిజిటల్ ఇండియా పథకంలో మొత్తం సీఎస్‌సీ ద్వారానే అమలు చేస్తారు. ఢిల్లీలో కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి, ముంబైలో హెడ్ ఆఫీస్ ఉంటుంది. వీరికి మహారాష్ట్ర ప్రభుత్వంతో చేసిన అనుభవం ఉందని అంటున్నా, అక్కడ హిందూ ల్యాబ్స్ అనే సంస్థ ఇలాంటి పథకాలకు సర్వీస్‌లు అందిస్తోంది. కానీ, సీఎస్‌సీ పేరు ఉంటే ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో కూడా ఈ పేరుతో తెలంగాణలో అమలు చేద్దామని అనుకున్న 3 నెలల ముందే కంపెనీ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అప్పటికి తెలంగాణలో ఒక్క ల్యాబ్ కూడా లేదు. ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్న తర్వాత 6 నెలల్లో ల్యాబ్స్‌ని ఏర్పాటు చేసుకునేందుకు సమయం తీసుకున్నారు. దీనికి తోడు ప్రతి లేబర్‌కి కాల్ చేసి టెస్టులకు ఒత్తిడి చేశారు. ఇప్పటి వరకు 14 లక్షల కార్మికుల్లో 11 లక్షల మందికి టెస్టులు చేశారు. ఇవి నాణ్యత లేనివిగా కార్మికులు భావిస్తున్నారు. ఈసీజీ తీయకుండానే పంపిస్తున్నారని ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఇలా అనేక లోపాలతో వందల్లో ఖర్చుకు వేలల్లో తీసుకుంటూ, తక్కువ స్టాఫ్‌తో క్యాంపులు ఏర్పాటు చేసి ఫోటోలు అప్ లోడ్ చేస్తున్నారని సీపీఎం నేత శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. ఇన్ డైరెక్ట్‌గా ప్రైవేట్ హాస్పిటల్స్‌కి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ స్కీమ్‌లో ఎక్కువ మొత్తంలో మనీ మిస్ యూజ్ అవుతోందని గుర్తించింది. ఆ డబ్బుతో కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్ షిప్స్ ఇస్తూ విద్యను ప్రోత్సహిస్తోంది. ఇదే టెస్టులను ప్రైవేట్ ల్యాబ్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అయ్యే ఖర్చుతోనే బిల్స్ క్లెయిమ్ చేస్తున్నారు. అనవసరంగా టెస్టులు చేసి ప్రైవేట్ హాస్పిటల్స్‌కి పంపిస్తున్నారని అక్కడి స్కామ్‌తో తేలింది. దీంతో తెలంగాణలో కూడా కొత్త సర్కార్ ఈ పథకంపై పునరాలోచించాలనే డిమాండ్ పెరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం అవిర్భవించాక పంపకాల్లో లేబర్ సెస్ మొత్తంలో రూ.1,463 కోట్లను పీవీ మురళీ సాగర్ అక్రమంగా ఏపీ ప్రభుత్వ అకౌంట్స్‌కి బదిలీ చేశారు. అక్టోబర్ 29, 2014న ఎలాంటి లెక్కలు తేలకుండానే, రేషియో ప్రకారం తెలంగాణకు రూ.609 కోట్లు రావాల్సి ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండానే చెక్కులు జారీ చేశారు. దీనిపై తెలంగాణ కమిషనర్ చిక్కడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ 560/2014 కేసు నమోదు చేసి, అకౌంట్స్‌ని ఫ్రీజ్ చేశారు.

అయితే, ఈ వివాదం ముగించేందుకు ఈమధ్య కలిసిన ఇరు రాష్ట్రాల సీఎంల మీటింగ్ ఎజెండాలో చేర్చారు. కానీ, డిస్కషన్ చేయకుండానే వదిలేశారు. అభం, శుభం తెలియకుండా కాయ కష్టాన్నే నమ్ముకుని బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ పనులు చేసుకునే కార్మికుల సెస్ సొమ్ముపైనే అందరి దృష్టి ఉంటుంది. ప్రతి నిర్మాణ రంగంలో లేబర్‌కి ఒక శాతం సెస్‌ల రూపంలో కంపెనీల నుంచి చెల్లించాలి. వాటిని వారి కుటుంబాల అవసరాలకే ఖర్చు చేయాలి. కానీ, కేసీఆర్ బీసీ బంధుకి రూ.300 కోట్లు, కరోనా ఖర్చుల్లో రూ.1000 కోట్లు వాడేసుకున్నారు. ఇప్పటికీ మరో వెయ్యి కోట్లకు పైగానే ఖజానా ఉంది. కానీ, వాటిని అనవసరపు ఖర్చులకు, పనికి రాని స్కీమ్‌లకు ఖర్చు చేసేందుకు ఉన్నతాధికారులు ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి కార్మికుల కుటుంబాల జీవితంలో వెలుగు నింపేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కేటీఆర్ కు మతిమరుపు ఉందా..?

హైదరాబాద్: కేటీఆర్.. బీఆర్ఎస్ పార్టీలో కీలక నేత.. మాజీ మంత్రి. పదేళ్ల పాటు ఆయన రాష్ట్రానికి ఆయన సేవలందించారు. అమెరికాలో చదువుకున్నారు.. ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడేస్తారు. ఇన్నీ అర్హతలున్న కేటీఆర్‌కు కాస్త కామన్‌సెన్స్‌తో పాటు.. జ్ఞాపకశక్తి తక్కువనిపిస్తోంది. ఫస్ట్ కేటీఆర్ రీసెంట్‌గా చేసిన ఓ ట్వీట్‌ను చూద్దాం. ట్వీట్ సారాంశం ఏంటంటే.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల ప్రభుత్వ భూములను ఫైనాన్స్ కంపెనీలకు తనఖా పెడుతోంది. వీటి విలువ రూ.20 వేల కోట్లు.. వీటిని తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల నిధులను సమీకరించనుంది రాష్ట్ర ప్రభుత్వం. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారిని 100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు రెడీ అయ్యింది. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయన్న విషయం నిజం. అలాంటి ప్రాంతంలో 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తాకట్టు పెట్టడమనేది అనాలోచిత చర్య. ఉన్న భూములు తాకట్టు పెడితే కంపెనీలకు ఏమిస్తారు ? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి ? ఇదీ ఆయన ట్వీట్ సారాంశం.బాగుంది.. విపక్షం అంటే ప్రశ్నించాలి. ప్రజల సంక్షేమం కోసం పోరాడాలి. ప్రస్తుతం బీఆర్ఎస్ నేత కేటీఆర్ కూడా తాను అదే చేస్తున్నానని అనుకుంటున్నారు. కానీ ఆయన.. వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో మర్చిపోయినట్టున్నారు. ఒక్కసారి కాస్త పాస్ట్‌లోకి వెళదాం. ఎకరం భూమి వంద కోట్లు పలికింది.. అనే హెడ్‌లైన్స్ మీరు వినే ఉంటారు. అప్పట్లో కోకాపేట్ ఫేజ్ 2 భూములను వేలం వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఇలా వేలం వేసి రూ.3 వేల కోట్లకు పైగా సమీకరించారు. వేలం అంటే ఈ భూములు ఆ రియల్ ఎస్టేట్ కంపెనీలకు అమ్మేసినట్టే కదా. మళ్లీ ఆ భూములు తిరిగి రావు. నిజానికి కేటీఆర్ చేస్తున్నవి అలిగేషన్స్ మాత్రమే.



దానికి ఓ పేపర్‌లో వచ్చిన వార్తను బేస్ చేసుకున్నారు. ఇది నిజమా? కాదా? అన్నది ఇంకా తేలలేదు. ఫర్ సపోజ్.. నిజమే అనుకుందాం. నిధుల సమీకరణకు రేవంత్ సర్కార్ భూములను తాకట్టు పెడుతుందనే అనుకుందాం. మరి తాకట్టు బెటరా? వేలం బెటరా? ఇది ప్రజలతో పాటు.. కేటీఆర్ గారే ఆలోచించాలి. కేటీఆర్ ఏం చెబుతున్నారంటే.. వేలం మంచిది.. ఎందుకంటే భూములు కంపెనీలకు లేదా రియల్ ఎస్టేట్ సంస్థలకు పర్మినెంట్‌గా ఇచ్చేయొచ్చు. అదే తాకట్టు అయితే మళ్లీ ఆ భూములను ప్రభుత్వం తీసుకుంటుంది కాబట్టి అది నేరం. వేలం మంచింది.. ఎందుకంటే పర్మినెంట్‌గా అమ్మేసి కేవలం 5 వేల కోట్ల వరకు సమీకరించవచ్చు. అదే తాకట్టు పెట్టి 10 వేల కోట్లు సమీకరించి.. తిరిగి ఇచ్చేసి మళ్లీ భూములను తీసుకోవడం నేరం. వేలం మంచిది.. సొంత లేదా అనుచరవర్గానికి చెందిన వారికి ఖరీదైన భూములను అప్పగించవచ్చు. అదే తాకట్టు పెట్టి ప్రజల సంక్షేమం కోసం నిధులను సమీకరిస్తే నేరం. పెరిగిన విలువకు తగ్గట్టుగా తాకట్టు పెట్టి నిధులు సమీకరించుకోవడం బెటరా? ఇంకా సింపుల్‌గా చెప్పాలంటే.. మీ దగ్గర బంగారం ఉంది.. దానిని అమ్ముకొని డబ్బు తెచ్చుకుంటారా? లేక దానిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకుంటారా? ఈ చిన్న విషయం అర్థమైతే.. కేటీఆర్ చేసిన ట్వీట్‌లో ఎంత తప్పు ఉందో మీకు అర్థమవుతోంది. గతంలో అంటే సింగరేణి కోల్ మైన్స్ వేలం సమయంలో కూడా మీరు ఇలానే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అసలు బీఆర్ఎస్ హయాంలో కోల్ మైన్స్ వేలమే జరగలేదని చెప్పే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మీ అనుచరగణానికి చెందని కంపెనీలకు గనులను అప్పగించేందుకు వేలంలో పాల్గొనకుండా ఉన్నది నిజం కాదా? ఈ విషయాన్ని అప్పుడు దాచి ప్రజలను తప్పుదోవ పట్టించారు. ఇప్పుడేమో.. ఇలా వేలానికి, తాకట్టుకు తేడా తెలియకుండా మరోసారి ప్రజల్లో లేని ఆలోచనలను పుట్టిస్తున్నారు. తప్పులను ఎత్తిచూపాలి.. ప్రశ్నించాలి.. అందులో ఎలాంటి తప్పు లేదు. కానీ లేని తప్పును ఎత్తి చూపి.. మీరు తప్పులో కాలేసి.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తా అంటే మాత్రం అస్సలు కుదరదు. ఎందుకంటే ప్రజలంతా తెలివితక్కువ వారు కాదు. ఈ విషయాన్ని ఇప్పటికైనా గుర్తించి కాస్త బాధ్యతతో మెలిగితే ఉన్న పరువు దక్కుతుంది. ఇక మతిమరువు విషయానికి వద్దాం. తాము చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పుఅన్నట్టు ఉంటుంది కేటీఆర్‌గారి వ్యవహారం. తెలంగాణకు కాబోయే సీఎం అనే రేంజ్‌లో ప్రచారం జరిగిన కేటీఆర్ గారి తీరు ఇది. కేటీఆర్ గారు.. వన్ సజేషన్.. ఇప్పటికే ప్రజలు మీ తీరు నచ్చక పక్కన పెట్టేశారు. కానీ మీ తీరు మాత్రం మారడం లేదు. మాటలు తగ్గిపోయి.. ట్వీట్స్ పెరిగిపోయాయి. కనీసం ఆ ట్వీట్స్ అయినా.. ముందు వెనుకా కాస్త ఆలోచించి చేయండి.

# మల్లారెడ్డి మాస్టర్ ప్లాన్ ఏంటీ..?

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో మాస్ లీడర్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే నేత మాజీ మంత్రి మల్లారెడ్డి. మాస్ మల్లన్నగా అందరూ ముద్దుగా పిలుచుకునే మల్లారెడ్డి తన రాజకీయ జీవితాన్ని కీలక మలుపు తిప్పాలని నిర్ణయించుకున్నారట. స్వతహాగా వ్యాపారవేత్త అయిన మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేతగా బాగా ఫేమస్ అయ్యారు. ఇక 2014లో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి.. తన క్రేజ్ ను మరింత పెంచుకున్నారు. మల్లారెడ్డి అంటేనే ఓ బ్రాండ్‌గా అందరికీ గుర్తిండిపోయారు. 2014లో తొలిసారిగా మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన మల్లారెడ్డి? ఆ తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరి? రాష్ట్రమంత్రి కూడా అయిపోయారు. ఇక గత ఎన్నికల్లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచినా, బీఆర్ఎస్ ఓడిపోవడంతో మల్లారెడ్డికి కష్టాలు ఎక్కువయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మల్లారెడ్డి అప్పట్లో విసిరిన చాలెంజ్ లతో ప్రత్యర్థుల సంఖ్యను పెంచుకున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో వ్యక్తిగతంగా కూడా మల్లారెడ్డికి పొసగకపోవడంతో ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వానికి టార్గెట్‌గా మారడంతో అండ కోసం ఎదురుచూసిన మల్లారెడ్డి బీజేపీలో చేరాలని? ఆ పార్టీతో టచ్ లోకి వెళ్లారని ప్రచారం జరిగింది. కానీ, మల్లారెడ్డికి బీజేపీలో చేర్చుకునే విషయంలో సానుకూల స్పందన లేకపోవడంతో మరింత ఇబ్బందులు పెరిగిపోయాయట. ఐతే ఈసారి మల్లారెడ్డి వేసిన ప్లాన్‌తో మొత్తం తెలంగాణ రాజకీయం రక్తి కట్టేలా కన్పిస్తోంద ప్రస్తుతం మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేలుగా ఉన్నారు. బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఈ ఇద్దరూ తొలుత కాంగ్రెస్‌లోకి వెళ్లాలని భావించారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే విభేదాలు ఉండటంతో ఆ పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో మల్లారెడ్డి విద్యాసంస్థల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం పూనుకోవడం, వరుసగా కేసులు నమోదు చేయిస్తుం డటం, తన నియోజకవర్గంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కాంగ్రెస్ లో చేర్చుకుంటూ తనను ఒంటరిని చేయాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తుండటం వల్ల? హస్తం పార్టీతో చేతులు కలపాలనే ఆలోచనను విరమించుకున్నారు మల్లారెడ్డి.ఆ తర్వాత కమలం గూటికి చేరేందుకు ప్రయత్నించారు. కావాలంటే రాజీనామా చేసైనా బీజేపీ తరఫున పోటీ చేసి గెలుస్తానంటూ ఆఫర్ కూడా ఇచ్చారట. అయితే కారణమేదైనా బీజేపీ నుంచి కూడా రెడ్ సిగ్నలే పడింది. ప్లాన్ ం కింద కాంగ్రెస్, ప్లాన్ ఃగా బీజేపీని ఎంచుకున్న మల్లారెడ్డి.. ఆ రెండు పార్టీల నుంచి ప్రతికూల స్పందనే ఎదురవడంతో ఈ సారి గమ్మత్తైన ప్లాన్ వేశారు. అదే తన పొలిటికల్ కెరీర్‌ను ప్రారంభించిన టీడీపీలో చేరడం ద్వారా తన రాకను అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఒకేసారి చెక్ చెప్పాలని భావిస్తున్నారు మల్లారెడ్డి.తెలంగాణలో టీడీపీకి పెద్దగా బలం లేకపోయినా, తనకు ప్రభుత్వం నుంచి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే టీడీపీలో చేరడం కూడా మంచిదే అన్న ఆలోచనలో పడ్డారు మల్లారెడ్డి. ప్రస్తుతం తెలంగాణ టీడీపీకి పెద్ద దిక్కు లేకపోవడం కూడా తనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. తనతోపాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలను టీడీపీలోకి తీసుకువెళ్లి.. ఆ పార్టీ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా చక్రం తిప్పాలని భావిస్తున్నారట మల్లన్న. ప్రస్తుతం బీజేపీ-టీడీపీ మధ్య పొత్తు ఉండటం, కేంద్రంలో టీడీపీ కీలకంగా మారడంతో తాను టీడీపీలో ఉంటే తనకు ఇండైరెక్ట్‌గా బీజేపీ మద్దతు ఉంటుందని భావిస్తున్నారు మల్లన్న. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య సత్సంబంధాలు ఉండటంతో? తెలంగాణ ప్రభుత్వం తన వైపు చూసే అవకాశమే ఉండదని ప్లాన్ చేస్తున్నారట మల్లన్న తెలంగాణలోనూ తన అస్థిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తున్న టీడీపీ? మల్లారెడ్డి వంటివారు చేరతామంటే కాదనడనే ధీమాలో మల్లన ఉన్నారని తెలుస్తోంది. దీంతో తన మదిలోని ఆలోచనను సన్నిహితులతో పంచుకున్నారట.. ఇక టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తన ప్రతిపాదనను తీసుకెళ్లేందుకు అడుగులు వేస్తున్నారని సమాచారం. టీడీపీలో చేరితే ప్రస్తుతానికి తనకు ఉన్న ముప్పు నుంచి తప్పించుకోవచ్చని.. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లోనూ బీజేపీతో అలయెన్స్‌తో రాజకీయంగా చక్రం తిప్పవచ్చనే అంచనాలో ఉన్నారట మల్లన్న. టీడీపీ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మల్లారెడ్డి.. మళ్లీ టీడీపీ గూటికే వెళతారనే ప్రచారం తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారింది. వాస్తవానికి సీఎం రేవంత్‌రెడ్డికి, మల్లారెడ్డికి టీడీపీలో ఉన్నప్పుడే విభేదాలు మొదల య్యాయి. అప్పటి విబేధాలను ఇప్పుడు పరిష్కరించు కునేందుకు అదే టీడీపీని వాడుకోవాలని మల్లారెడ్డి చూడటం ఆసక్తికరంగా మారింది. ఇక బీజేపీ కూడా టీడీపీ మిత్రపక్షం కావడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ మార్పులు జరిగినా తాను సేఫ్ జోన్‌లో ఉంటారనే ఆలోచనతోనే టీడీపీయే బెస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని మల్లారెడ్డి ఆలోచిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి మాస్ మల్లన్న పొలిటికల్ యాక్షన్‌పై తెలంగాణలో హాట్ డిబేట్ జరుగుతోంది.

# చదువులో ముందు,,,,, అల్లరిలో వెనుక ఉండాలి

## విద్యాలయాల్లో ర్యాగింగ్ కు చోటివ్వకూడదు

## సీనియర్ సివిల్ జడ్జి కే. జయరాం రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, విద్య నేర్చుకోవడంతోపాటు చక్కని క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ ...విద్యార్థులు సోదర భావంతో, స్నేహపూర్వక వాతావరణంలో చదువులు కొనసాగించాలని అన్నారు. ఒకరిని ఒకరు ర్యాగింగ్ చేసుకొని బాధపెడితే అది సంస్కారం కాదు అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ ను అలవాటు చేసుకోకూడదు అని జడ్జి అన్నారు. అదేవిధంగా మైనర్లు వాహనాలు నడపకూడదు అని సూచించారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే జీవితాలు విచ్ఛిన్నం అవుతాయని జడ్జి అన్నారు. ఎవరికి ఆపద వచ్చినా కూడా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు , అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక , న్యాయవాది మచ్చ వసంత, అధ్యాపకులు, విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆలయాలకు చెక్కుల పంపిణీ

హైదరాబాద్: బోనాల పండుగ సందర్భంగా మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని అమ్మవారి ఆలయాలకు ఎం ల్ సి షాబీర్ అలీ,మలక్పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల,సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి మరియు ఎండోమెంట్ అధికారులతో ఆలయ కమిటీ నిర్వాహకులకు చెక్కులను అందజేశారు. బొగ్గులకుంట లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 96 అమ్మవారి ఆలయాలకు ఎమ్మెల్యే బలాల రూ.4కోట్ల విలువ గలా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.మలక్ పేట నియోజక వర్గ ప్రజలంత భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలని,భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్థరాత్రి... కాల్పుల కలకలం

హైదరాబాద్: హైదరాబాదులో మరోసారి పోలీసు కాల్పుల కలకలం రేపింది. నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఓ వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే ఆ వ్యక్తి తప్పించుకునే ప్రయత్నంచేయడంలో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో వ్యక్తికి గాయాలు అయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు స్నాచింగ్ ముఠాపై మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో దొంగలు కత్తులు, గొడ్డళ్లతో పోలీసులపై ఎదురుదాడికి దిగారు. ఈ ఘటన అర్థరాత్రి 1.15 గంటలకు నాంపల్లి రైల్వే స్టేషన్ దగ్గర చోటు చేసుకుంది. అయితే నిందితులను పట్టుకునేందుకు స్పెషల్ డికాయిటీ టీమ్ ప్రయత్నించింది. పోలీసులపై దొంగలు ఎదురు దాడికి దిగడంతో గాల్లో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

# తెలంగాణలో నెల 15 నుంచి అమ్మ మాట- అంగన్వాడీ బాట

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 'అమ్మ మాట- అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు తెలుస్తుంది. తెలంగాణలో రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రీప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కొత్తగా ప్రీప్రై మరీ సిలబస్ను సిద్ధం చేసింది. చిన్నారుల్ని గుర్తించి ఈ ప్రీప్రైమరీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఈ నెల 15 నుంచి 20 వరకు అమ్మ మాట- అంగన్వాడీ బాట పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతోంది. ఈ కార్యక్రమం చివరిరోజున సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనుంది.

# పాడయిన పన్నీరు, పాలు స్వాధీనం

## కిచెన్ లో తిరుగుతున్న ఎలుకలు, పందికొక్కులు

## ఇదీ పేరుగాంచిన ఎమరాల్డ్ స్వీట్స్ భాగోతం

హైదరాబాద్: హైదరాబాద్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇందిరా పార్క్ సమీపం గల ఎమ్రాల్డ్ స్వీట్స్ లో జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ తనిఖీలు జరిగాయి. స్వీట్ల తయారీలో పేరుగాంచిన ఎమరాల్డ్ స్వీట్స్ షాప్ కిచెన్ లో దారుణమైన పరిస్థితులు బయటపడ్డాయి. కంపు కొడుతూ దుర్గంధ భరితమైన వాతావరణంలో స్వీట్ల తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. రోజుల తరబడి ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన పాలు, పెరుగు, పన్నీర్ సీజ్ చేసారు. స్వీట్ల తయారీలో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ లో ఎలుకలు, పందికొక్కులు తిరుగుతున్నాయి. దాంతో ఎమరాల్డ్ స్వీట్స్ తయారీ నిర్వాకులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్ అయ్యారు.

# పిచ్చోడు హల్ చల్

తాండూరు: మతిస్థిమితం లేని ఓ పిచ్చోడు తాండూర్ పట్టణంలో హల్చల్ చేశాడు. రోడ్లపై ఎవరు కనిపించిన వారి పై దాడికి దిగాడు. దీంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఏకంగా పిచ్చోడిపై వందమంది దాడికి దిగారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో చోటుచేసుకుంది . స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఉదయం 6 గంటల కు రోడ్డుపై వెళ్తున్న కొందరు వ్యక్తులపై గుర్తుతెలియని వ్యక్తి పిచ్చోడు దాడికి తెగపడ్డాడు . దీంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. పిచ్చోడు ఇష్టం ఉన్నట్లుగా వివరించడంతో, తీరును గమనించిన స్థానిక ప్రజలు పిచ్చోడు పై ప్రతి దాడి చేశారు ఏకంగా వందమంది పిచ్చోడి పై దాడికి తెగ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పిచ్చోన్ని గొలుసులతో కట్టేసి స్టేషన్ కు తరలించారు.

# నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

రంగారెడ్డి: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీ పై సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసారు. 15 లక్షల విలువ గల 7.3 టన్నుల పేస్ట్ స్వాదీనం చేసుకున్నారు. బుద్వేల్ లోని గ్రీన్ సిటీ లో గోప్యంగా అప్న ఎంటర్ప్రైసెస్ అనే పేరు పై ఫ్యాక్టరీని అమీర్ నిజాన్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. అక్రమంగా సింథటిక్ కలర్స్, యాసిడ్స్ మరియు కెమికల్ వాటర్ వాడుతున్నట్లు నిర్ధారించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి పరీక్షలు జరుపుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలువాల్సి ఉంది

# గంభీర్ రాకతో చిగురించిన ఆశలు..
## చెమటోడ్చుతున్న అయ్యర్..




భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ పునరామనం కోసం గట్టిగానే కష్టపడుతున్నాడు. ఆటతో పాటు ఫిట్‌నెస్ మీద ఫోకస్ పెట్టి నిత్యం శ్రమిస్తున్నాడు. టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్ నియామకం కావడంతో కోల్‌కతా నైట్ రైడర్స్(%ఖఖ=%) కెప్టెన్‌లో ఆశలు చిగురించాయి. వెన్నునొప్పి సాకుతో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన అయ్యర్.. గౌతీ అండతో జట్టులోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. అందుకోసం మైదానంలో నిత్యం చెమటోడ్చుతున్నాడు. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టిన అయ్యర్ స్ప్రింటర్‌లా వేగంగా పరుగెత్తుతున్నాడు. ప్రస్తుతం అతడి రన్నింగ్ వీడియో ఒకటి వైరల్ అవుతోంది. నిరుడు ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్‌లో మెరిసిన అయ్యర్.. వెన్నునొప్పి సాకుతో రంజీలకు దూరమయ్యాడు. ముంబై తరఫున ఆడాలని బీసీసీఐ ఆదేశించినా పెడచెవిన పెట్టాడు. మరోవైపు బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ అయ్యర్ గాయపడలేదని, ఫిట్‌గానే ఉన్నాడని సర్టిఫికెట్ ఇచ్చింది. దాంతో, బీసీసీఐ అతడి సెంట్రల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. జరగాల్సిన నష్టం జరిగాక అయ్యర్ ముంబై తరఫున రంజీ సెమీఫైనల్లో బరిలోకి దిగాడు.

అయ్యర్ కెప్టెన్సీలో అజేయ శక్తిగా..

ఐపీఎల్ పదిహేడో సీజన్‌లో గౌతం గంభీర్ మెంటార్‌గా, శ్రేయస్ అయ్యర్ సారథిగా ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ చాంపియన్‌గా నిలిచింది. కోల్‌కతా మాజీ సారథిగా రెండు ట్రోఫీలు అందించిన గౌతీ.. ఈసారి మెంటార్‌గా మ్యాజిక్ చేశాడు. భారత జట్టులో చోటు కోల్పోయిన అయ్యర్ కెప్టెన్సీలో కేకేఆర్‌ను అజేయ శక్తిగా మలిచాడు.

ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్, సునీల్ నరైన్ వీర బాదుడుకు.. వరుణ్ చక్రవర్తి, మిచెల్ స్టార్క్, వైభవ్ అరోరా బౌలింగ్ తోడవ్వడంతో లీగ్ దశ నుంచి ఆల్‌రౌండ్ షోతో ప్రత్యర్థులను వణికించింది. ఇక కీలకమైన క్వాలిఫయర్ 1లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులోనూ మళ్లీ ఆరెంజ్ ఆర్మీపై అలవోక విజయంతో అయ్యర్ బృందం ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది.

# ఎంతో మందితో ఆడా.. కానీ ఆ భారత బ్యాటర్‌లా ఎవరూ భయపెట్టలేదు: అండర్సన్




క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. ఇంగ్లండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ జెంటిల్మన్ గేమ్?కు గుడ్? బై చెప్పేశాడు. 21 ఏళ్ల పాటు నిఖార్సయిన పేస్ బౌలింగ్?తో అభిమానుల్ని ఉర్రూతలూగించిన జిమ్మీ ఇక మీదట క్రికెట్? ఫీల్డ్?లో కనిపించడు.

ఈతరం చూసిన బెస్ట్ ఫాస్ట్ బౌలర్స్?లో అండర్సన్? టాప్?లో ఉంటాడు. అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించిన అతడు.. టెస్ట్ స్పెషలిస్ట్?గా పేరు తెచ్చుకున్నాడు. సుదీర్ఘ కెరీర్?లో ఏకంగా 188 టెస్టుల్లో 704 వికెట్లు తీసి గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్?గా నిలిచాడు. ఒక పేస్ బౌలర్ అన్ని వికెట్లు తీస్తాడని ఎవరూ ఊహించలేదు. గాయాలతో సావాసం చేసే సీమర్స్ రెండు దశాబ్దాలకు పైగా కంటిన్యూ అవడం అంటే అదో మ్యాజిక్ అనే చెప్పాలి. ఓవరాల్? కెరీర్?లో 40 వేల బంతులు వేయడం మరో హైలైట్. 147 ఏళ్ల క్రికెట్ హిస్టరీలో ఒక బౌలర్ 40 వేల బంతుల మార్క్?ను అందుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. వెస్టిండీస్?తో జరిగిన లార్డ్స్ టెస్ట్?తో కెరీర్?కు గుడ్?బై చెప్పిన జిమ్మీ.. ఈ మ్యాచ్?లో 4 వికెట్లు పడగొట్టాడు. సెకండ్ ఇన్నింగ్స్?లో 3 వికెట్లు తీసి విండీస్? పతనాన్ని శాసించాడు. పోతూ పోతూ ఓ సూపర్ డెలివరీ వేశాడు. అద్భుతమైన ఇన్?స్వింగర్? వేసి బ్యాటర్?ను క్లీన్?బౌల్డ్ చేశాడు. అండర్సన్?కు ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఇంగ్లండ్ ఫ్యాన్స్ భారీగా లార్డ్స్?కు తరలివచ్చారు. ఆఖరుగా డ్రెస్సింగ్ రూమ్?లో షాంపేన్ తాగి వాళ్లకు చీర్స్ చెప్పాడు అండర్సన్. ఇన్నేళ్ల కెరీర్?లో ఎంతో మందితో కలసి ఆడిన ఈ ఇంగ్లీష్ సీమర్.. టీమిండియా కింగ్ విరాట్ కోహ్లీ అంటే మాత్రం తనకు భయమని అంటున్నాడు. అతడ్ని ఎక్కువ సార్లు ఔట్ చేయలేకపోయాననే బాధ తనను వెంటాడుతోందని చెప్పాడు. 'ఏ ప్లేయర్ కెరీర్?లో అయినా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్ని సిరీస్?ల్లో బాగా ఆడాననే ఫీలింగ్ ఉంటుంది. ఇంకొన్ని సిరీస్?ల్లో బ్యాటర్లు నా బౌలింగ్?లో ఈజీగా రన్స్ చేశారని అనిపిస్తుంది. విరాట్ కోహ్లీని కెరీర్ స్టార్టింగ్? టైమ్?లో చాలామార్లు అలవోకగా ఔట్ చేశా. ప్రతి బాల్?కు అతడ్ని ఔట్ చేస్తానని అనిపించేది. కానీ ఈ మధ్య కాలంలో పరిస్థితి మారిపోయింది. విరాట్?ను ఔట్ చేయడం అసాధ్యంగా మారింది. అది నన్ను న్యూనతకు గురిచేసింది. అతడ్ని ఎక్కువ సార్లు ఔట్ చేయలేకపోయాననే బాధ ఉంది' అని అండర్సన్ చెప్పుకొచ్చాడు. తాను బౌలింగ్ చేసిన వారిలో బెస్ట్ బ్యాటర్‌గా మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరు చెప్పాడు జిమ్మీ. సచిన్ బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతిసారి అతడికి చెత్త బాల్ వేయొద్దని ఆలోచనతోనే ఆడేవాడ్నని గుర్తుచేసుకున్నాడు. ఎంత బాగా వేసినా సచిన్ పరుగులు రాబట్టేవాడంటూ మెచ్చుకున్నాడు. మరి.. కోహ్లీ–సచిన్ మీద అండర్సన్ చేసిన వ్యాఖ్యలపై మీ ఒపీనియన్?ను కామెంట్ చేయండి

# అండర్సన్ రిటైర్మెంట్.. గుడ్‌బై విషెస్ చెప్పిన సచిన్ టెండూల్కర్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్ .. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన లార్డ్స్ టెస్టులో అతను అల్విదా ప్రకటించేశాడు.

ఈ నేపథ్యంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్(%ఖుఎఫ్లఱఅ ంవఅఅబశ్రీఖుతీ%) ఆ గ్రేట్ బౌలర్‌కు తనదైన స్టయిల్‌లో ఫేర్‌వెల్ విషెస్ తెలిపాడు. జిమ్మీ బౌలింగ్‌ను ఎంతో ఎంజాయ్ చేసినట్లు సచిన్ తన ట్వీట్‌లో వెల్లడించాడు. 188 టెస్టులు ఆడిన అండర్సన్ మొత్తం తన ఖాతాలో 704 వికెట్లు వేసుకున్నాడు.

22 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో నీ బౌలింగ్‌తో అందర్నీ బౌల్డ్ చేశావని జేమ్స్‌ను సచిన్ మెచ్చుకున్నాడు. ఆ స్పీడ్, యాక్షన్, అక్యురెసీ, స్వింగ్, ఫిట్‌నెస్ అద్భుతమని తన గుడ్‌బై సందేశంలో సచిన్ తెలిపాడు. నీ ఆట తీరుతో ఎంతో మందికి ప్రేరణగా నిలిచావని కీర్తించాడు. ఆరోగ్యం, సంతోషంతో జీవితం సాఫీగా సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సచిన్ కోరుకున్నాడు.

భారత్‌తో 39 టెస్టుల్లో అండర్సన్ ఆడాడు. వాటిల్లో అతను 149 వికెట్లు తీసుకున్నాడు. దీంట్లో ఆరు సార్లు అయిదేసి వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్‌తో సచిన్ టెండూల్కర్ 32 టెస్టుల్లో ఆడాడు. వాటిల్లో అతను 2535 రన్స్ చేశాడు. దాంట్లో ఏడు సెంచరీలు, 13 ఫిఫ్టీలు ఉన్నాయి.

# ఇప్పుడే ముగిస్తారా?

**– సిరీస్ విజయంపై భారత్ గురి**

**– భారత్, జింబాబ్వే నాల్గో టీ20 నేడు**

**– సాయంత్రం 4.30 నుంచి సోనీస్పోర్ట్స్‌లో..**




ఐసీసీ టీ20 ప్రపంచకప్ చాంపియన్ టీమ్ ఇండియా.. జింబాబ్వేపై పొట్టి సిరీస్‌పై కన్నేసింది. ఐదు మ్యాచుల సిరీస్‌ను నేడు నాల్గో మ్యాచ్‌లోనే ముగించాలని ఎదురుచూస్తుంది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న శుభ్‌మన్ గిల్ సేన.. 3–1తో టీ20 సిరీస్ సాధించాలని అనుకుంటుంది. తుది జట్టు కూర్పు గిల్‌కు సవాల్‌గా మారనుండగా.. భారత్, జింబాబ్వే నాల్గో టీ20 పోరు నేడు.

నవతెలంగాణ–హరారే

టీ20 సిరీస్ సొంతం చేసుకోవటమే లక్ష్యంగా నేడు జింబాబ్వేతో నాల్గో మ్యాచ్‌కు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. కానీ ఇదే సమయంలో శుభ్‌మన్ గిల్ నాయకుడిగా కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అందరికీ తుది జట్టులో చోటు ఉండాలనే తాపత్రయంలో మూడో టీ20లో జట్టు సమతూకం దెబ్బతిన్నది. నేడు అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా.. బ్యాటర్లు, ఆల్‌రౌండర్లు, బౌలర్ల ఎంపికలో వివేకం చూపించాల్సి ఉంటుంది. మరోవైపు జింబాబ్వే సైతం మరోసారి సంచలనం చేయాలని ఉవ్విళ్లూరుతోంది.

మార్పులు అవసరమే!

తొలి మ్యాచ్‌లో ఓటమి నుంచి గిల్ సేన వేగంగా పుంజుకుంది. వరుసగా రెండు మ్యాచుల్లో విజయాలు నమోదు చేసింది. యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, శివం దూబె తుది జట్టులో రావటం జట్టును బలోపేతం చేసింది. కానీ ఇదే సమయంలో బ్యాటింగ్ లైనప్ ఓపెనర్ల మయంగా మారింది. యశస్వి జైస్వాల్, గిల్, రుతురాజ్, అభిషేక్ శర్మలు టాప్–4లో బ్యాటింగ్ చేశారు. సంజు శాంసన్, రింకూ సింగ్ వరుసగా నం.5, నం.6 స్థానాల్లో ఆడారు. దీంతో బౌలింగ్ లైనప్‌పై ఒత్తిడి పెరిగింది. అభిషేక్ శర్మ, శివం దూబె పరుగుల నియంత్రణ పాటించలేదు. దీంతో ఏడు ఓవర్లలో 39/5తో నిలిచిన జింబాబ్వే ఏకంగా 20 ఓవర్లలో 159/6తో మెరుగ్గా ముగించింది. డెత్ ఓవర్లలో బౌలర్లు మెరిసినా.. నేడు తుది జట్టులో మరో బౌలర్ అవసరం. టాప్–4లో ఓ బ్యాటర్‌పై వేటు వేసి.. అదనపు బౌలర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం లేకపోలేదు. అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్‌లతో పాటు రవి బిష్ణోరు, వాషింగ్టన్ సుందర్ అంచనాలను అందుకున్నారు. భారత్ నేడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

పుంజుకుంటారా?

ఆతిథ్య జింబాబ్వే మరో విజయంపై కన్నేసింది. ఆ జట్టులో బ్యాటింగ్ లైనప్ నిలకడగా రాణించటం లేదు. టాప్‌లో మెరిస్తే.. మిడిల్‌లో చేతులెత్తేస్తున్నారు. మిడిల్‌లో రాణిస్తే.. టాప్ నిరాశపరుస్తుంది. బ్యాటర్లు సమిష్టిగా ఆడితే మరో విజయం సాధించగలమనే నమ్మకం ఆ జట్టులో ఉంది. భారత స్పిన్నర్లు రవి బిష్ణోరు, వాషింగ్టన్ సుందర్ ఓవర్లను కాచుకుని.. ఇతర బౌలర్లపై ఎదురుదాడి చేసేందుకు ఆ జట్టు ప్రణాళిక రచిస్తోంది. కెప్టెన్ సికిందర్ రజా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. బ్రియాన్ బెనెట్, మేయర్స్, కాంప్‌బెల్ సహా క్లైవ్ రాణిస్తున్నారు. బౌలర్లు సైతం కలిసికట్టుగా ఒత్తిడి పెంచితే.. భారత్‌ను స్వల్ప స్కోరుకు పరిమితం చేయవచ్చని జింబాబ్వే భావిస్తోంది.

పిచ్, వాతావరణం

హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ విలక్షణంగా స్పందిస్తుంది. ఆరంభంలో పేస్, బంతి మెత్తబడిన తర్వాత స్పిన్‌కు అనుకూలిస్తుంది. బ్యాటర్లు పిచ్‌ను అర్థం చేసుకోకుండా ఎదురుదాడి చేస్తే.. మూల్యం చెల్లించుకోక తప్పదు. భారత్‌కు స్పిన్నర్లు రవి బిష్ణోరు, వాషింగ్టన్ సుందర్ ఓవర్లు కీలకం కానున్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

ఆటగాళ్ల రొటేషన్?!

భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్‌ను కాస్త కఠినంగా రూపొందించారు. తొలి రెండు మ్యాచులను వరుస రోజుల్లో షెడ్యూల్ చేయగా.. చివరి రెండు మ్యాచులను వరుసగా శని, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. దీంతో ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి అందించటం కోసం టీమ్ ఇండియా రొటేషన్ పాలసీ అమలు చేసే అవకాశం ఉంది. నేడు ఆడిన ఆటగాళ్లకు చివరి మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వాలనే ఆలోచన డ్రెస్సింగ్‌రూమ్‌లో కనిపిస్తుంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్, రింకూ సింగ్, శివం దూబె, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోరు, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్.

జింబాబ్వే: వెస్లీ, మారుమని, బ్రియాన్ బెనెట్, డయాన్ మేయర్స్, సికందర్ రజా (కెప్టెన్), జొనాథన్ కాంప్‌బెల్, క్లైవ్ మదాండె, వెల్లింగ్టన్ మసకడ్జ, బ్లెస్సింగ్ మజరబాని, రిచర్డ్, చతార.

# 'రాజకీయం చేయొద్దు.. భారత జట్టుకు ఘన స్వాగతం పలుకుతాం'



వచ్చే ఏడాది జరుగబోయే చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై ప్రతిష్టంభన నెలకొంది. పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి టీమిండియా వెళ్లడం లేదని సమాచారమే అందుకు కారణం.

దాంతో, నిరుడు ఆసియా కప్ మాదిరిగానే హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరుపుతారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ లెజెండరీ బౌలర్ వసీం అక్రమ్ తమ దేశమంతా టీమిండియా రాక కోసం ఎదురు చూస్తోందని అన్నాడు.

'రాజకీయాలను ఆటకు ముడిపెట్టొద్దు. పాక్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత జట్టు వస్తే మేమంతా ఘన స్వాగతం పలుకుతాం. మా దేశ పౌరులంతా టీమిండియా రాక కోసం చూస్తున్నారు' అని వసీం తెలిపాడు. అంతేకాదు చాంపియన్స్ ట్రోఫీకి పాక్‌లో ఏర్పాట్లు చకాచకా సాగుతున్నాయని వసీం చెప్పాడు. సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయి. కొత్త స్టేడియాలు కట్టించారు. లాహోర్, ఇస్లామాబాద్, కరాచీల్లో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ కొత్త మైదానాలు నిర్మించాడు. కాబట్టి ఈసారి టోర్నీ గొప్పగా సాగుతుందని ఆశిస్తున్నా అని వసీం వెల్లడించాడు.

సరిహద్దు వివాదం కారణంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఆగిపోయి ఏండ్లు గడుస్తోంది. దాంతో, ఐసీసీ టోర్నీల్లోనూ దాయాది జట్లు తలపడుతున్నాయి. అందుకని చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్ అంటే చాలు స్టేడియాలు నిండిపోతున్నాయి. ఇక నిరుడు కూడా పాక్ గడ్డపై ఆసియా కప్ ఆడమంటే ఆడమని బీసీసీఐ తెగేసి చెప్పింది. దాంతో, లంక వేదికగా టీమిండియా మ్యాచ్‌లు నిర్వహించారు.

ఇప్పుడేమో చాంపియన్స్ ట్రోఫీ విషయం మరోసారి చర్చకు వచ్చింది. 2025 ఫిబ్రవరిలో పాక్ క్రికెట్ బోర్డు ఈ మెగా టోర్నీ ఆతిథ్యానికి సిద్ధమైంది. కానీ, బీసీసీఐ మాత్రం జట్టును పంపేందుకు రెడీగా లేదు. దాంతో, భారత బోర్డు వైఖరిపై మరోసారి అంతర్జాయ క్రికెట్ మండలి (%×జజ%)ని పీసీబీ ఆశ్రయించే అవకాశముంది. అయితే.. రోహిత్ సేనను పంపాలా? వద్దా? అనే అంశంపై కేంద్ర హోమ్ శాఖ నిర్ణయం తీసుకోనుంది. ఆ తర్వాతే బీసీసీఐ ప్రకటన వెల్లడించే అవకాశముంది.

# టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా..!



యువ భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో జోరు మీద ఉన్న గిల్ సేన టీ 20 సిరీస్పై కన్నేసింది. ఇవాళ నాలుగో టీ20లో జింబాబ్వేను ఢీకొట్టనుంది.

ఈ సిరీస్ ను ఘోర పరాజయంతో మొదలుపెట్టిన భారత్ ఆ తర్వాత లోపాలను అధిగమించింది. వరుసగా రెండు మ్యాచ్లోనూ విజయం సాధించింది. నాలుగో టీ20లోనూ అదే జోరు కొనసాగించాలని భావిస్తున్నది. గత మ్యాచ్లో హాఫ్ సెంచరీతో గిల్ టచ్లోకి వచ్చాడు. రుతురాజ్ గైక్వాడ్ నిలకడగా రాణిస్తుండటం ప్రధాన బలం. మూడో టీ20కి జైశ్వాల్, శాంసన్, దూబె రాకతో జట్టులో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్ లో తుషార్ దేశ్ పాండే ఆరంగేట్రం చేస్తున్నారు. జింబాబ్వేతో జరుగుతున్న నాలుగో టీ 20 మ్యాచ్ లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.

భారత జట్టు : శుబ్ మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, శివమ్ దూబే, అభిషేక్, రుతురాజ్, సంజు శాంసన్, రింకు సింగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ఖలీల్, తుషార్ దేశ్ పాండే.

జింబాబ్వే : మాధెవెరె, మారుమణి, బెన్నెట్, మయర్సు, రజా (కెప్టెన్), కాంప్ బెల్, మదాండే, ముజరబానీ, చటారా, నగరవ, ఫరాజ్ అక్రమ్.

# వైఎంసీఏ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా యూజీన్ జార్జ్

హైదరాబాద్: సీనియర్ కోచ్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్సల్టెంట్ డా. యూజీన్ జార్జ్ వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. బాస్కెట్‌బాల్‌లో సీనియర్ కోచ్‌గా, జాతీయ చాంపియన్‌షిప్స్ టైటిల్స్ సాధించిన మాజీ ఆటగాడిగా జార్జ్ సుపరిచితులు. ఇక నుంచి వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ స్పోర్ట్స్, గేమ్స్ అభివృద్ధిని జార్జ్ పర్యవేక్షించనున్నారు.

# పేస్ దిగ్గజం వీడ్కోలు



లార్డ్స్ : పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ ఆటకు వీడ్కోలు పలికాడు. టెస్టు క్రికెట్ కెరీర్‌లో 704 వికెట్ల ఘనతతో అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. కెరీర్ ఆఖరు మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై అండర్సన్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ గస్ అటిక్సన్ 12 వికెట్ల ప్రదర్శనతో తొలి టెస్టులో వెస్టిండీస్ చిత్తుగా ఓడింది. విండీస్ వరుసగా 121, 136 పరుగులకు కుప్పకూలగా.. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 371 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది.

ఆల్‌టైమ్ లెజెండ్: 42 ఏండ్ల జేమ్స్ అండర్సన్ కెరీర్‌ను అత్యున్నతంగా ముగించాడు. ఆఖరు మ్యాచ్‌లోనూ బంతితో నిప్పులు చెరిగాడు. కెరీర్ 704 వికెట్లతో ఆల్‌టైమ్ లెజెండ్‌గా ఆట నుంచి నిష్క్రమించాడు.

2003 లార్డ్స్ టెస్టులో జింబాబ్వేపై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన జేమ్స్ అండర్సన్.. అదే మైదానంలో 2024లో వెస్టిండీస్‌పై లాంఛనం ముగించాడు. 188 టెస్టులు ఆడిన జేమ్స్ అండర్సన్ 26.45 సగటు, 2.79 ఎకానమీ, 56.8 స్ట్రయిక్‌రేట్‌తో 704 వికెట్లు పడగొట్టాడు. ఓ ఇన్నింగ్స్‌లో 7/42, ఓ మ్యాచ్‌లో 11/71 అండర్సన్ అత్యుత్తమ గణాంకాలు. 32 సార్లు నాలుగు వికెట్లు, 32 సార్లు ఐదు వికెట్లు సహా 3 సార్లు పది వికెట్ల ప్రదర్శన అండర్సన్ సొంతం. ఆఖరు మ్యాచ్‌లో గార్డ్ ఆఫ్ హానర్ దక్కించుకున్న అండర్సన్.. మైదానంలో జట్టును ముందుండి నడిపించాడు. దిగ్గజం అండర్సన్‌కు ఇంగ్లీశ్ అభిమానులు లార్డ్స్‌లో భావోద్వేగ వీడ్కోలు పలికారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**